ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 32.5
కనిష్ఠం 24.2
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 31 జూలై 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586 (300.3200)	2,82,124	3,11,422
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.08 (3.96)	883.44	644.27
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.242	3,01,567	3,01,567

చికెన్ ధరలు | లైవ్ : రూ.144 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.245

ప్రభుత్వంలో ఆర్టీసీతో పాటు ఆ సంస్థ ఉద్యోగుల విలీన ప్రక్రియపై నీలి నీడలు అలుముకున్నాయి. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం సైతం నాన్చుడు ధోరణి అవలంభిస్తోందని ఆర్టీసీ కార్మికులు విమర్శిస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



విలీనం ఊసేదీ?



» ప్రభుత్వ నిర్ణయం కోసం ఆర్టీసీ కార్మికుల ఎదురుచూపు » యూనియన్ల పునరుద్ధరణ లేక అటకెక్కిన డిమాండ్లు

నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఏడు డిపోలు ఉన్నాయి. దేవరకొండ, కోదాడ, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, యాదగిరిగుట్ట డిపోలో ఉన్న కార్మికులు, ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీలో డ్రైవర్ పోస్టులు, కార్మికులు, కండక్టర్ పోస్టులు ఖాళీగా ఉండగా, వాటి భర్తీని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీనికి తోడు కొత్తగా ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెట్టి డ్రైవర్లను కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకుంటుండటంతో ఇప్పటికే ఖాళాగా ఉన్న పోస్టులను సంస్థ భర్తీ చేస్తుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు గత ప్రభుత్వం అసెంబ్లీ, శాసనమండలిలో బిల్లు పాస్‌చేసి గవర్నర్‌కు నివేదించింది. ఆ తరువాత వివిధ ఆటంకాల అనంతరం ఆ బిల్లుకు ఆమోదం లభించినా అమలుకునోచుకోలేదు. చివరికి అపాయింట్‌మెంట్ డేట్‌ను ప్రకటించ గా, ఎన్నికల కోడ్ కారణంగా ఆ ప్రక్రియ నిలిచింది. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఆర్టీసీ, ఉద్యోగులను విలీనం చేస్తామని హామీ ఇవ్వగా, ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు దాటుతున్నా విలీనం ఊసే లేదు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల నేతలతో ఇప్పటి వరకు చర్చలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం విలీనంపై ప్రణాళికను సిద్ధం చేయకపోవడంతో అసలు ఉంటుందా? లేదా? అని ఉద్యోగ, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. సంస్థ ప్రభుత్వంలో విలీనమైతే కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారడంతోపాటు పేస్కేల్ లభిస్తుంది.

భర్తీకాని ఖాళీ పోస్టులు

నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలో పదేళ్ల క్రితం వరకు 3,500మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేసే వారు. అందులో ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానాలను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోల పరిధిలో 1,700 నుంచి 2వేల మంది లోపే ఉద్యోగ, కార్మికులు పనిచేస్తున్నట్టు సమాచారం. ప్రధానంగా కార్మికులు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంతో పాటు 2021 పేస్కేల్, ఉద్యోగ భద్రత, యూనియన్‌ల పునరుద్ధరణ, రిటైర్డ్ ఉద్యోగులకు 2017 పేస్కేల్ బకాయిలు, కార్మికుల నియామకాలు రెగ్యులర్ ప్రాతిపాదికన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలని, ముఖ్యంగా కార్మికులపై పనిభారం తగ్గించాలని కోరుతున్నారు. పనిభారంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో యూనియన్లు రద్దయ్యాయి. యూనియన్‌లు ఉన్నప్పుడు రీజియన్ వ్యాప్తంగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేవారు. గెలుపొందిన సంఘాలు రీజియన్‌తో పాటు రాష్ట్రస్థాయిలో ఉద్యోగుల కార్మికుల హక్కుల కోసం పోరాడేవి. ప్రస్తుతం యూనియన్లు లేకపోవడంతో సమస్యలపై ప్రశ్నించే గొంతులు లేకుండా పోయాయి. ప్రైవేట్ బస్సులు రావడంతో డ్రైవర్ల భర్తీ జరగడం లేదు. ప్రైవేట్ డ్రైవర్లతోటే ఎలక్ట్రికల్ బస్సులు నడిపిస్తున్నారు. ఎలక్ట్రికల్ బస్సుల మానిటరింగ్ మొత్తం హైదరాబాద్ నుంచే సాగుతోంది. దీనికి తోడు చాలా బస్సులు టికెట్‌ల కోసం డ్రైవర్లకే టిమ్స్ యంత్రాలు ఇచ్చారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి టికెట్‌లు ఇవ్వడంతో కండక్టర్ పోస్టుల భర్తీ కూడా లేకుండాపోతోంది.

ఉద్యోగుల్లో అభద్రతా భావం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక హామీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. అయితే ఈ పథకం అమలుచేసినందుకు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సి న రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో మంజూరుచేయడం లేదని సంఘాలు విమర్శిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీకి ప్రభుత్వం రూ.300 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్న ర గడిచినా ఆర్టీసీ విలీన ప్రక్రియపై ఎలాంటి చర్చలు నిర్వహించకపోవడం, ఎలాంటి నిర్ణ యం తీసుకోకపోవడంతోపాటు రూ.300 కోట్ల బకాయి చెల్లింపులో చేస్తున్న తాత్సారంతో సంస్థపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని విమర్శిస్తున్న యూనియన్లు వీటిని ఉదాహరణగా చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం ఆర్టీసీ కార్మికులు దశల వారి ఆందోళన లు చేశారు. సమ్మెకు సైతం పిలుపు ఇవ్వడంతో ప్రభుత్వం యూనియన్లతో చర్చించి

- మిగతా 6వ పేజీలో...

ఆర్టీసీకి పెరిగిన ఆక్యుపెన్సీ

(ఆంధ్రజ్యోతి, సూర్యాపేటఅర్బన్): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ అవకాశం కల్పించడంతో సంస్థ ఆక్యుపెన్సీ పెరిగింది. గతంలో ఆక్యుపెన్సీ 65శాతం ఉంటే ప్రస్తుతం 95శాతానికి చేరింది. జీరో టికెట్ కారణంగా బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో పల్లెవెలుగు బస్సులు 190 ఉండగా, అద్దెకు బస్సులు 172 వరకు ఉన్నాయి. అదేవిధంగా ఎక్స్‌ప్రెస్‌లు 116 ఉండగా, 66 అద్దె ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆర్టీసీకి ప్రతీ రోజు సుమారు రూ.2కోట్లు, నెలకు రూ.60కోట్ల వరకు ఆదాయం వస్తోంది.

ఆర్టీసీ బస్సుల్లో
కానరాని మెడికల్ కిట్లు
ఆపద వస్తే అందని ప్రథమ చికిత్స 6

● మేఘుమా.. వర్షించుమా!



ఈ సీజన్‌లో ముందస్తుగా మురిపించిన వర్షాలు అదునులో ముఖం చాటేశాయి. దీంతో రైతులు పంటల సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ కమ్ముతున్న మబ్బులను రైతులు ఆశగా చూసి వర్షించాలని వరుణుడిని వేడుకుంటున్నారు. మునుగోడులో బుధవారం ఆకాశాన్ని మేఘాలు ఇలా కమ్మేశాయి.
● ఆంధ్రజ్యోతి, మునుగోడు

● పండుటాకులు పింఛన్ కోసం..



ప్రతీ నెల 25వ తేదీన ప్రభుత్వం ఆసరా పెన్షన్‌లను పోస్టాఫీసుల ద్వారా పంపిణీచేస్తోంది. అయితే ఈ నెల నుంచి ఫేస్ రికగ్నేషన్ ద్వారా పింఛను పంపిణీ చేయనుండటంతో ఈ నెల జాప్యమైంది. అయితే బుధవారం పెన్షన్ పంపిణీచేస్తున్నారని తెలియడంతో మర్రిగూడ మండల కేంద్రంలోని పోస్టాఫీసుకు వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే పింఛన్ల పంపిణీలో జాప్యం చోటుచేసుకోవడంతో 11గంటల వరకు వృద్ధులు అక్కడే వేచి ఉన్నారు. చివరికి డబ్బు లేదని పోస్టల్ అధికారులు సెలవివ్వడంతో వృద్ధులు నిరాశగా వెనుదిరిగారు.
● ఆంధ్రజ్యోతి, మర్రిగూడ

1న డిప్యూటీ సీఎం, మంత్రుల రాక

దామరచర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను ఆగస్టు 1న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సందర్శించనున్నారు. థర్మల్ ప్లాంట్‌లోని యూనిట్-1ని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. దీంతో ఈ యూనిట్ ద్వారా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభంకానుంది. అనంతరం కృష్ణానది తీరంలో జెన్‌కో టౌన్‌షిప్ కోసం భూమి పూజ చేయనున్నట్టు తెలిసింది.

4న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు భూమి పూజ

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఆగస్టు 4న భూమి పూజ చేయనున్నట్టు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో సంబంధిత అధికారులతో ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 4న నల్లగొండలో మంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 22 ఎకరాల్లో, 5,36,194చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.200కోట్ల అంచనాతో అధునాతన హంగులతో భవనం నిర్మిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నల్లగొండకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఈఈ బాల ప్రసాద్, కన్సల్‌టెన్సీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నేరడుగొమ్ము, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యతో పాటు, నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం నేరడుగొమ్ము కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. వంటగది, స్టోర్‌రూం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, గణితం, సామాన్యశాస్త్రం ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విటమిన్లు, తదితర అంశాలపై విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలానికి మంజూరైన పీహెచ్‌సీకి సంబంధించిన స్థలాన్ని ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి పరిశీలించారు. కేజీబీవీకి ప్రహరీ లేదని కేజీబీవీ ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తాత్కాలిక ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆర్డీవో రమాణారెడ్డిని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, కేజీబీవీ స్పెషలాఫీసర్ శ్వేత, తదితరులు ఉన్నారు.

26 గేట్ల నుంచి కృష్ణమ్మ



7

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక పెరగడంతో బుధవారం 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 586 అడుగులు (300.3200 టీఎంసీలు)గా ఉంది.

హక్కుల సాధనకు పోరాటమే మార్గం

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

హాలియా, జూలై30 (ఆంధ్రజ్యోతి): మాలలు కోల్పోయిన రాజ్యాంగ బద్ధమైన హక్కులను తిరిగి పొందాలంటే పోరాటమే మార్గమని, దానికి మాలలంతా సిద్ధం కావాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మాల మహానాడు నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ వాదులైన మాలలను అణచివేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల కేటాయింపుతో మాలలకు విద్య, ఉద్యోగ అవకశాలు అందకుండా పోయాయని అన్నారు. ఇంజనీరింగ్, గురుకుల పాఠశాలల్లో సీట్లు రాక, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే స్థోమత లేక చదువులు ఆగిపోయే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు రిజర్వేషన్లను 5 శాతానికి పరిమితం చేసి రోస్టర్ పాయింట్ల కేటాయింపుతో ఆ 5 శాతం రిజర్వేషన్ కూడా మాలలకు దక్కకుండా చేసి రాజ్యాంగ బద్ధ హక్కులను కాలరాశారని అన్నారు. మన హక్కులు తిరిగి పొందాలంటే పోరాటమే మార్గమన్నారు. ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల కేటాయింపుపై మాలలకు జరిగే నష్టాన్ని మండల, గ్రామ స్థాయి సమావేశాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, పరిమి కోటేశ్వర్‌రావు, చెన్నకేశవులు, జంగాల బిక్షం, లక్ష్మమ్మ, లకుమల లిగయ్య, జంగాల శ్రీనివాస్, రువ్వ వెంకటేశ్వర్లు, శాలెం రాజు, జంగాల బిక్షం, జంగాల వీరేందర్, పాలపటి సుమలత, మౌనిక, మద్దూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లూరు దుర్గాప్రసాద్

నల్లగొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సన్నద్ధం కావాలని పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి నెల్లూరు దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం చేయడం కోసం నల్లగొండ పార్లమెంటు అధ్యక్షుడిగా కార్యకర్తలందరితో సంబంధం ఉన్న వ్యక్తిని గుర్తించి నియమించాల్సిన అవసరం ఉందన్నారు. బనకచర్లపై బీఆర్ఎస్ చేస్తున్న రాద్ధాంతం జలవివాదం కాదని, పొలిటికల్ డ్రామా అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాతాల రాంరెడ్డి, ఎల్వీ యాదవ్, ముప్వ అరుణ్ కుమార్, వస్కుల కృష్ణయ్య, సైదేశ్వర్‌రావు, నారాయణ, సత్యం, రాములు, మాన్యా నాయక్, జంగయ్య, వెంకటయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వాసు తదితరులు ఉన్నారు.

శ్రావణ సందడి



బోనాలు తీసుకొస్తున్న మహిళలు

కనగల్, జూలై 30: (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద రేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తులు బుధవారం అమ్మవారికి శ్రావణ బోనాలను సమర్పించారు. ఆలయం వద్ద నెత్తిన బోనాలతో శివసత్తులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యం

ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



చింతపల్లిలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ ఇలాత్రిపాఠితో కలిసి తొలుత జ్యోతి వెలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు కాకుండా పార్టీ నాయకులకు పథకాలు అందించినట్లు తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల సంక్షేమానికి కట్టుబడి ఉండి పారదర్శకంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాణారెడ్డి, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, మాల్ మార్కెట్ యారు చైర్‌పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, యాదగిరి, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి పాటుపడాలి: ఆర్‌ఎం



ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం జాన్‌రెడ్డి

మిర్యాలగూడటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తూ ఆర్టీసీ అభివృద్ధికి పాటు పడాలని ఆర్టీసీ ఆర్‌ఎం కొణతం జాన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు నాణ్యమైన సేవలందిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. శ్రావణమాసంతో ఆర్టీసీ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉద్యోగులు అదనపు విధులకు సిద్ధమవ్వాలన్నారు. వరలక్ష్మీ వ్రతం, రాఖీపౌర్ణమి, స్వాతంత్ర్య దినోత్సవం, కృష్ణాష్టమి పండుగలు ఉన్నందున ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశముందని, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రాఖీ పండగ సందర్భంగా మహిళా ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుందని, వారికి మహాలక్ష్మి పథకంలో సేవలందించాలని ఆదేశించారు. సంస్థకు రథసారధులైన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు సమయస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. అనంతరం శ్రావణమాస ఛాలెంజ్ బ్యానర్‌ను ఆవిష్కరించారు.

సాగర్ ఎడమకాల్వలో యువకుడి గల్లంతు

మిర్యాలగూడఅర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమ కాల్వ సమీపంలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఇద్దరు యువకుల్లో ఒకరు గల్లంతుకాగా మరొకరిని స్థానికులు కాపాడారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు, స్థానికులు, తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చౌగాని శంకర్ (38) పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవాడు. సూర్యాపేటలో మరో ప్రైవేటు ఉద్యోగం చూసుకుని అక్కడకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నాడు. స్నేహితుడు రాకేష్‌తో కలిసి ఈత కొట్టేందుకు మధ్యాహ్న సమయంలో సాగర్ ఎడమకాల్వ వద్దకు వెళ్లారు. మల్లేపల్లి రాకేష్ కాల్వలోకి వెళ్లి ఈదుతుండగా చౌగాని శంకర్‌కు ఈత రాకపోవడంతో అక్కడే ఉన్న మెట్లను పట్టుకున్నాడు. శంకర్ పట్టుతప్పి కాల్వలోకి జారి నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. శంకర్‌ను కాపాడేందుకు రాకేష్ ప్రయత్నించగా అతడు సైతం నీటి ప్రవాహంలో కొట్టుకుపోతూ కేకలు పెట్టాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కొందరు, సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న రైతులు, మహిళా కూలీలు గమనించి వారి వద్ద ఉన్న వస్త్రాల సహాయంతో రాకేష్‌ను కాపాడారు. అప్పటికే శంకర్ గల్లంతయ్యాడు.

పర్యావరణ వస్తువులే హితం



నల్లగొండలో చేనేత సంచులను అందజేస్తున్న వావ్ సంస్థ నిర్వాహకులు(ఫైల్)

● మట్టిలో విలీనమయ్యే వస్తువులపై విస్తృత ప్రచారం

(ఆంధ్రజ్యోతి-రామగిరి)

పర్యావరణానికి హానికరంగా మారిన ప్లాస్టిక్‌పై నల్లగొండ మునిసిపల్ అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో మట్టిలో విలీనమయ్యే వస్తువులపై అవగాహన కల్పిస్తున్నారు. ఇదే సమయంలో వాటి వినియోగం కోసం స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. ఐటీసీ చొరవతో వావ్ ప్రాజెక్ట్ అనే స్వచ్ఛంద సంస్థ మునిసిపల్ అధికారులతో కలిసి ప్లాస్టిక్‌తో నష్టాలపై నల్లగొండ పట్టణంలో 39 వేల గృహ యజమానులకు అవగాహన కల్పించింది. అదే సమయంలో చేనేత తయారీ సంచులను అందజేశారు. అంతేకాకుండా విద్యార్థుల నుంచి పాతపుస్తకాలను తూకం చొప్పున కొనుగోలు చేసి వాటికి బదులుగా స్టడీ మెటీరియల్స్‌ను అందజేస్తోంది. సోనియా సమభావన సంఘం అనే స్వచ్ఛంద సంస్థ మునిసిపల్ ట్రాక్టర్ల ద్వారా సేకరించే పొడి చెత్తను కిలోకు రూ.20 చొప్పున కొనుగోలు చేసి రీసైక్లింగ్ కోసం తరలిస్తున్నారు. ప్రతి నెలా 25 నుంచి 30 టన్నుల వరకు పొడి వ్యర్థాలను సేకరిస్తున్నారు.

మడతపెడితే పర్సు తెరిస్తే చేతిసంచి


జిప్ మూసివేస్తే పర్స్‌గా..

పర్యావరణ ప్రేమికుడు సురేష్‌గుప్తా పట్టణంలో పలువురికి ఉచితంగా పర్యావరణ హితమైన చేతిసంచిని అందిస్తున్నారు. వినూత్నంగా తయారు చేసిన ఈ బ్యాగ్‌కు ఉన్న జిప్‌లను చేతిసంచిగా, జిప్‌లు అన్ని మూసివేస్తే పర్సుగా వినియోగించవచ్చు. దీని తయారీకి రూ.200 వరకు అవుతుందని తెలిపారు.


జిప్ విప్పితే చేతి సంచిగా..

ప్లాస్టిక్‌తో నష్టాలపై అవగాహన ఉండాలి



ప్లాస్టిక్ కవర్లతో ఎలాంటి నష్టాలు వస్తాయనే దానిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. కొంతమంది నాయకులు, అధికారులు మొక్కలు నాటితే సరిపోతుందన్న ఆలోచనలో ఉన్నారు. ఆ ఒక్క దానితోనే పర్యావరణాన్ని కాపాడలేం. చేసే ప్రతీ పని పర్యావరణ హితంగా ఉండాలి.

సురేష్‌గుప్తా, పర్యావరణ ప్రేమికుడు

మట్టిలో విలీనమయ్యే కవర్లపై అవగాహన కల్పిస్తాం



మట్టిలో కలిసే కవర్లను వినియోగించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తాం. బయో డిగ్రేడబుల్ కవర్ల డీలర్లతో సంప్రదింపులు చేస్తున్నాం. ఈ కవర్లను వినియోగిస్తే పర్యావరణంతో పాటు ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు.

సయ్యద్ ముసాబ్‌అహ్మద్, మునిసిపల్ కమిషనర్, నల్లగొండ

మోసపోయాం..న్యాయం చేయండి


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మర్రిగూడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పిస్తానంటూ మాయ మాటలు చెప్పి రూ.లక్షలు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలంటూ నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెం భూనిర్వాసితులు ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు మొరపెట్టుకున్నారు. బుధవారం మర్రిగూడ పోలీస్‌స్టేషన్ తనిఖీకి వచ్చిన ఎస్పీని వారు కలిశారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న చర్లగూడెం రిజర్వాయర్ ముంపు గ్రామం నర్సిరెడ్డిగూడెం బాధితులను నాగర్‌కర్నూల్ జిల్లా తాండూర్ మండలం శిరసనవాడ గ్రామానికి చెందిన మాదరగొని ప్రసాద్ తాను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆఫీసులో పనిచేస్తున్నానంటూ పరిచయం చేసుకున్నాడు. నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పిస్తానంటూ నమ్మబలికి ఆరుగురి వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.2.50 లక్షల చొప్పున రూ.15 లక్షలు వసూలు చేశాడని ఉప్పరగొని యాదయ్య, కుక్కల శివ, కుక్కల సత్తయ్య, బొమ్మ కంటి యాదయ్య తెలిపారు. అయితే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించలేదని, పలుమార్లు కలిసినా పట్టించుకోవడం లేదంటూ వాపోయారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోమంటూ డబ్బులు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమను మోసంచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని, డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు ఎస్పీకి మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్ న్యాయం జరిగేలా చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని ఎస్ఐ కృష్ణారెడ్డిని ఆదేశించారు. ఎస్పీ వెంట దేవరకొండ అదనపు ఏఎస్పీ మౌనిక ఉన్నారు.

ఆపద వస్తే అంతేనా?

● ఖాళీగా ప్రథమ చికిత్స పెట్టెలు

ఆర్టీసీ బస్సుల్లోని ప్రథమ చికిత్స పెట్టెలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పేరుకే బాక్సులు ఏర్పాటుచేసినా అందులో ఔషధాలు ఉండటం లేదు. ఏదైనా ఆపద తలెత్తితే వైద్యసేవలు అందని పరిస్థితి నెలకొంది. ప్రయాణికులతో పాటు డ్రైవర్లు, కండక్టర్లకు ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే ప్రథమ చికిత్స అందని పరిస్థితి దాపురించింది. గతంలో ప్రథమ చికిత్స పెట్టెల్లో అత్యవసర వైద్యం కోసం ఔషధాలు, ఇతర చిన్నచిన్న మెడికల్ సంబంధిత వస్తువులు ఉండేవి. రాను రాను ఆ పెట్టెలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఏ బస్సులోనూ ప్రథమ చికిత్స పెట్టెల్లో ఔషధాలు లేవు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

ఎంతోమంది ప్రయాణ సమయంలో అనారోగ్యానికి గురవుతుంటారు. పలు సందర్భాల్లో డ్రైవర్లు, కండక్టర్లు అనారోగ్యానికి గురై మృత్యువాతపడుతున్నారు. ఎక్కువగా డ్రైవర్లు విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గుండెపోటు వచ్చినప్పుడు వారికి ప్రథమ చికిత్స అందజేస్తే కొన్ని గంటలపాటు ప్రాణాపాయం నుంచి కాపాడి అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏదైనా ఆసుపత్రికి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. బస్సుల్లో అలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతేకాక బస్సుల్లో అపరిశుభ్రత నెలకొంది. ప్రతిరోజూ బస్సులను శుభ్రం చేయాల్సి ఉన్నా, చేయడంలేదు. దీంతో బస్సుల్లో ప్రయాణికుల దుస్తులు దుమ్ము, ధూళి, మట్టితో మాసిపోతున్నాయి. పలు బస్సులకు కిటికీలకు ఉండాల్సిన అద్దాలు లేక వర్షాకాలంలో ప్రయాణికులు తడుస్తున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న బస్సులోని ప్రథమ చికిత్స పెట్టెలు

కానరాని మెడికల్ కిట్లు

బస్సులో డ్రైవర్ సీటు వెనకభాగంలో ప్రథమచికిత్సకు సంబంధించిన పెట్టెలను ఏర్పాటు చేస్తుంటారు. కానీ అవి ఖాళీగా ఉంటున్నాయి. గతంలో మెడికల్ కిట్లు ఉండేవి. అందులో ప్రథమ చికిత్సకు సంబంధించిన దూది, అయోడిన్, బ్యాండేజ్, కట్టుదుస్తులతో పాటు ఇతర ఔషధాలు ఉండేది. ప్రస్తుతం కనీసం ప్రథమ చికిత్సకు సం బంధించిన ఎలాంటి ఔషధాలు ఉండడంలేదు. ప్రయాణికులకు ఏదైనా గాయమైనా దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ఆర్టీసీ సంస్థ సిబ్బందితో పాటు ప్రయాణికులకు అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 762 ఆర్టీసీ బస్సులు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడ, దేవరకొండ, నార్కట్‌పల్లి, యాదగిరిగుట్టల్లో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల పరిధిలో 762 బస్సులు ఉండగా, అందులో 388 సంస్థవి కాగా 374 అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. వీటితో పాటు ఇటీవల నల్లగొండ, సూర్యాపేట డిపోల పరిధిలో 78 ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశపెట్టారు. ప్రతి రోజూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 3.50 లక్షలకుపైగా కిలోమీటర్లు తిరుగుతున్నాయి. ప్రతి రోజూ పెద్దసంఖ్యలో ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు సురక్షితంగా చేరవేస్తున్నాయి.

ఔషధాల ఏర్పాటుపై దృష్టి సారిస్తాం



ఆర్టీసీ బస్సుల్లో అత్యవసర మందుల ఏర్పాటుపై దృష్టి సారిస్తాం. రవాణా సౌకర్యాలు మెరుగుపడడం, అత్యవసర సేవలందించే 108 అంబులెన్స్‌లు అందుబాటులోకి రావడంతో ప్రథమ చికిత్సకు సంబంధించిన ఔషధాల విషయంలో దృష్టి సారించలేకపోయాం. ప్రస్తుతం బస్సుల్లో ఔషధాలు ఉండడంలేదు. సంస్థ ఉన్నతాధికారులతో సంప్రదించి అత్యవసర సమయంలో వినియోగించే ఔషధాలను అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతాం.

జాన్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, నల్లగొండ

మోహన్‌సాయి.. అనుగామి ఆస్ట్రోనాట్

● స్వదేశీ మిషన్‌లో భాగస్వామ్యం ● ఇది ఆయనకు మూడో మిషన్

(ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)



అనుగామి మిషన్ కంట్రోల్ సెంటర్ అధికారులతో ఆకుల మోహన్‌సాయి(రౌండప్‌లో)

భారత అంతరిక్ష స్వదేశీ అన్‌లాగ్ మిషన్ అనుగామిలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఆకుల మోహన్‌సాయి శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ మిషన్‌లో ఆయన ఆస్ట్రోనాట్‌గా శిక్షణ పొందారు. ఈ మిషన్‌కు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక వ్యక్తి మోహన్‌సాయి. ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన అనుగామి మిషన్‌లో 10 రోజుల పాటు స్వదేశీ శిక్షణ, ఎంపిక, మానసిక స్థితి, మూల్యాంకన విధానాలపై శిక్షణ జరిగింది. ఈ విశిష్టమైన మిషన్‌ను సైంటిస్ట్-ఎఫ్ విభాగాధిపతి, ఏవియేషన్ సైకాలజిస్ట్ డాక్టర్ సౌగంధి చతుర్వేదుల ఆధ్వర్యంలో ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరో స్పేస్ మెడిసిన్(ఐఏఎం)లోని సెంటర్ ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఇన్ స్పేస్ సైకాలజీ(సీఏఆర్) రూపకల్పన చేసింది. భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్)తో కలిసి విజయవంతంగా అమలుచేశారు.

గతంలో రెండు మిషన్‌లలో

మోహన్‌సాయి ఇంతకుముందు రెండు అంతర్జాతీయ లునార్ అన్‌లాగ్ వ్యోమగామి మిషన్‌లో పాల్గొన్నారు. 2023లో 10 రోజులు లునార్ అన్‌లాగ్‌మిషన్, 2024 పోలాండ్‌లో 19 రోజులు అంతర్జాతీయ లునార్ అన్‌లాగ్‌మిషన్‌లో శిక్షణ పొందారు. ప్రస్తుతం భారతదేశ మొట్టమొదటి స్వదేశీ అన్‌లాగ్‌మిషన్ 'అనుగామి'లో పాల్గొనడం ద్వారా మూడో అనలాగ్ మిషన్‌ను పూర్తి చేశారు. భారత్‌లో మొదటి మిషన్‌గా గుర్తింపు పొందిన అనుగామి మిషన్‌లో మానవ మానసిక పరిస్థితులు, సహజవాతావరణ వ్యతిరేక ప్రభావాలు, శారీరక సహన సామర్థ్యాలపై ఆయన చేస్తున్న పరిశోధనలు భారత అంతరిక్ష రంగానికి ఎంతో దోహదపడుతున్నాయి.

వీటిపైనే పరిశోధనలు

అనుగామి మిషన్‌లో మానసిక స్థైర్యం(రెస్లినెస్), మానసిక ఆరోగ్య పర్యవేక్షణ (మెంటల్ హెల్త్‌మానిటరింగ్), మైండ్‌ఫుల్‌నెస్ వంటి అంశాలపై ప్రత్యేక శాస్త్రీయతపై పరిశోధనలు చేశారు. అంతేకాకుండా శరీరంలో రక్తప్రసరణ మార్పులను అధ్యయనం చేసేందుకు ఏడురోజుల హెడ్‌డౌన్ టిల్ట్ బెడ్‌రెస్ట్ ప్రయోగం నిర్వహించారు. ఈ ప్రయోగం అంతరిక్ష శరీర శాస్త్రం, ఆరోగ్య నిర్వహణ పద్ధతులపై అమూల్యమైన సమాచారాన్ని అందిస్తుంది.

10 రోజుల ఐసోలేషన్

ఈ మిషన్‌లో శాస్త్రీయంగా రూపొందించిన స్పేస్ ఫ్లైట్ సిమ్యులేషన్ తరహాలో రూపొందించారు. మిషన్‌లోని సభ్యులు 10 రోజుల పాటు 250 గంటల పాటు ఐసోలేషన్(మూసివేత) పరిస్థితిలో ఉండి అంతరిక్ష ప్రయాణంలో ఎదురయ్యే మానవ కార్యకలాపాలు, మానసిక ధైర్యం, అత్యవసర పరిస్థితుల నిర్వహణను పర్యవేక్షిస్తారు. ఇదే అంశంపై శిక్షణలో ఉన్న మోహన్‌సాయి సిమ్యులేషన్‌లో 10 రోజుల పాటు ఉన్నారు. రాష్ట్రం నుంచి స్వదేశీ అనలాగ్‌మిషన్ అనుగామికి ఎంపికైన శిక్షణ పూర్తి చేసిన మోహన్‌సాయి ప్రస్తుతం భారత వైమానిక దళానికి చెందిన ఐఏఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరో స్పేస్ మెడిసిన్‌లో రీసెర్చ్ సైంటిస్ట్-1(నాన్‌మెడికల్)గా విధులు నిర్వహిస్తున్నారు.


ఐసోలేషన్ సూట్‌లో మోహన్‌సాయి

క్రూలో మోహన్‌సాయి ఆస్ట్రోనాట్

అనుగామి మిషన్ క్రూలో ఒక్కొక్కరు ఒక్కో విభాగానికి చెందిన వారుంటారు. అంతరిక్ష యానంలో ఉండి ప్రతీ విభాగానికి చెందిన వారు ఈ ప్రయోగంలో పాలుపంచుకుంటారు. అనుగామిలో కెప్టెన్ అగంద్ ప్రతాప్(ఐఎస్ఆర్‌వో) అనుభవజ్ఞుడైన టెస్ట్ పైలెట్‌తో పాటు గగన్‌యాన్‌కు ఎంపిన వ్యక్తి. అత్యవసరాలలో బతకగలగడంలో నిపుణుడు సీడీఆర్ రాజీవ్ ప్రసన్న(ఇండియన్ నేవీ), ఆయన నౌకాదళ మిగ్-29కే యుద్ధ విమాన పైలెట్. వీరితో పాటు ఆకుల మోహన్‌సాయి అంతరిక్ష శాస్త్ర పరిశోధకుడిగా, అన్‌లాగ్ ఆస్ట్రోనాట్‌గా మిషన్‌లో శిక్షణ పొందారు.

భవిష్యత్‌లో ఆస్ట్రోనాట్ అయ్యేందుకు

హుజూర్‌నగర్‌కు చెందిన ఆకుల మోహన్‌సాయి తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. మూడుసార్లు అన్‌లాగ్ మిషన్‌లో శిక్షణ పొందిన మోహన్‌సాయి బెంగుళూరులోని వైమానిక దళానికి చెందిన ఐఏఎంలో విధులు నిర్వహిస్తున్నారు. భారత అంతరిక్ష సంస్థలో పనిచేసేందుకు అవకాశాలు వచ్చిన నేపథ్యంలో 2035, 2040లో నిర్వహించనున్న అంతరిక్ష యానంలో అవకాశాల కోసం నిరంతరం పరిశోధనలు చేస్తున్నారు.

విలీనం ఊసేదీ?

(5వ పేజీ తరువాయి)

నచ్చజెప్పడంతో కార్మికులు వెనక్కు తగ్గారు. ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేస్తే ప్రభుత్వంపై భారం పడుతుందన్న ఆలోచనతోనే ముందుకు వెళ్లడంలేదని తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు ప్రతీ నెల వేతనం చెల్లించడంతోపాటు రుణాలు, పీఎఫ్, సీసీఎస్‌కు నిధుల కేటాయించలేదు. మహాలక్ష్మి ఉచితప్రయాణ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో అవి పేరుకుపోయాయి. అంతేగాక గ్రామీణ ప్రాంతాలకు పల్లె వెలుగు బస్సులు 50శాతం మేరకు తగ్గాయి. గతంలో కోదాడ నుంచి గంటకు ఒకటి చొప్పున ఎక్స్‌ప్రెస్ బస్సు ఉండగా, మిర్యాలగూడ, నల్లగొండ, సూర్యాపేటలో అత్యధికంగా డీలక్స్ బస్సులు ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్‌లు, పల్లెవెలుగు బస్సులు తక్కువగా ఉండటంతో మహిళలకు ఉచిత ప్రయాణం ఇబ్బందికరంగా మారింది.

ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి. ఉద్యోగులకు భద్రత లేకుండాపోయింది. యూనియన్‌ల పునరుద్ధరణ లేకపోవడంతో కార్మికుల సమస్యలపై ప్రశ్నించే గొంతు లేకుండాపోయింది. కార్మికులపై పనిభారం పెరుగుతున్నప్పటికీ పోస్టులు భర్తీ చేయడం లేదు. తక్షణమే ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి. ఎలక్ట్రికల్ బస్సులతో పాటు ప్రైవేట్ అద్దె బస్సులతో కొత్త పోస్టులు రాకుండా పోతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విలీనంపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలి. కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలి. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే నిర్వహించి కార్మికులను ఆదుకోవాలి.

గోపనబోయిన శ్రీనివాస్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా వడ్డెబోయిన సైదులు



నల్లగొండ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన వడ్డెబోయిన సైదులు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జీ.సంజీవరెడ్డి బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సైదులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు పహారాలో భాను అంత్యక్రియలు


వడపర్తిలో భాను అంతిమయాత్ర నిర్వహిస్తున్న బంధువులు

భువనగిరిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గొడ్డలితో దాడి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తికి చెందిన తోటకూరి భాను అంత్యక్రియలు బుధవారం సాయంత్రం పోలీసుల పహారాలో జరిగాయి. ఈ నెల 22న పొలంగట్టు వివాదంలో భానుతో ఘర్షణ పడిన సమీప బంధువులు తోటకూరి మల్లేశ్, తోటకూరి అజయ్ గొడ్డలితో దాడి చేసి గాయపరిచారు. ఆరు రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భాను మృతి చెందడంతో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం ఆందోళన చేశారు. మంగళవారం రాత్రి వరకు మృతదేహానికి అంత్యక్రియలు చేయకుండా కుటుంబసభ్యులు మొండికేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొనడంతో బుధవారం భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్, మహిళా ఎస్ఐ సంధ్య బాధిత కుటుంబ సభ్యులను బుజ్జగించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పహారా నడుమ భాను అంత్యక్రియలు పూర్తి చేయించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం బాపూజీనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన దమ్మోజు ఆంజనేయచారి(37) కొండమల్లేపల్లి మండలంలోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొలుముంతలపహాడ్ గ్రామపంచాయతీలోని బాపూజీనగర్ వద్ద రహదారిపై యూ టర్న్ వద్ద ట్రాక్టర్ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో అంజనేయచారి అక్కడికక్కడే మృతి చెందారు. ఆంజనేయచారి సోదరి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహన డిక్కీ నుంచి నగదు చోరీ

కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని స్థానిక సాగర్ రోడ్డులోని జేబీకాలనీలో నాగార్జున గ్రామర్ హైస్కూల్‌లో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనం డిక్కీ నుంచి నగదు చోరీ జరిగింది. ఎస్ఐ రమేష్ తెలిపిన ప్రకారం దేవరకొండకు చెందిన ముదిగొండ రామదాసు ద్విచక్రవాహనంపై నాగార్జున గ్రామర్ హైస్కూల్‌లో ఉన్న మిత్రుడిని కలవడం కోసం పాఠశాల లోపలికి వెళ్లాడు. కొద్దిసేపటికి తిరిగి వచ్చే సమయానికి ద్విచక్రవాహనంలో ఉన్న రూ.1.93లక్షలు చోరీకి గురయ్యాయి. ఈ విషయంపై బాధితుడు రామదాసు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిలో ఒకరికి జైలు శిక్ష, మరో నలుగురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీన సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా ఏడుగురు మోతాదుకు మించి మద్యం తాగినట్లు గుర్తించామన్నారు. వారిని బుధవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.1500 జరిమానా, మిగిలిన నలుగురికి కలిపి రూ.4500 జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని స్పష్టం చేశారు. వాహనాలు నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

నిరుపయోగంగా అద్దె గదులు!

● ఏడాది ముందే చేతులెత్తేసిన టెండరుదారుడు

● అసౌకర్యాలతో గదులు

● పట్టించుకోని ఆలయ అధికారులు

యాదగిరిగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్ర దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. వీరికోసం పాతఆచారాల పునరుద్ధరణ పేరుతో సదుపాయాలు కూడా ఒక్కొక్కటిగా కొండపైన సమకూరుతున్నాయి. కొండకింద పాతబస్టాండ్ ఎదురుగా భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన అద్దె గదుల విషయంలో మాత్రం దేవస్థానం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. టెండరుదారుడు వేలం పాట అధికంగా నిర్వహించడంతో అద్దె చెల్లించలేక చేతులెత్తేశారు. దేవస్థానం అద్దె గదుల నిర్వహణ పట్టించుకోక నిరుపయోగంగా మారి భక్తులకు గదుల కొరత ఎదురవుతోంది. కొండకింద కులసత్ర భవనాల అద్దె గదుల వ్యాపారానికి దేవస్థానం అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.


ఆండాళ్ నిలయంలో మూతపడిన దేవస్థానం అద్దె గదులు

రహదారి వెంట అద్దె గదులు

బస్టాండ్ ఎదురుగా హైదరాబాద్ ప్రధానరహదారిపై నిర్మించిన ఆండాళ్ నిలయం భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గోడలకు మర్రి, రావి చెట్లు మొలుస్తున్నాయి. 24 అద్దె గదులు, కింది భాగంలో 56 దుకాణ సముదాయాలు, 4 హాళ్లు ఉన్నాయి. భక్తులు అందుబాటులో ఉండేలా మూడేళ్ల (2023 మార్చి 20 నుంచి 2026 మార్చి 19 వరకు) కాలపరిమితితో టెండరు నిర్వహించారు. కాలక్రమేణా అద్దె అధికమై నష్టాలు వస్తున్నాయంటూ టెండరుదారుడు ఈ ఏడాది మార్చి నెలలో ఏడాది ముందుగానే టెండరుదారుడు దేవస్థానానికి అప్పగించాడు. నాటి నుంచి నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనార్థం తరలివచ్చే భక్తులకు గదుల వసతి లేకుండాపోయింది.



గదుల్లో సౌకర్యాల లేమి

రెండు భవనాల్లో కలిపి భక్తులకు అద్దెకు ఇచ్చేందుకు 24 గదులు ఉన్నాయి. ఏ ఒక్క గదిలో సౌకర్యాలు సరిగా లేవు. ఒక్కో గదిలో ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తలుపులు, నల్లాలు, స్విచ్ బోర్డులు పూర్తిగా ధ్వంసమై ఒక్కో తీరుగా గదుల పరిస్థితి ఉంది. కాంప్లెక్స్ వెనకాల గోడలకు మొక్కలు మొలిచాయి. వీటి స్థానంలో అవసరం ఉన్నచోట మరమ్మతులు చేసి గదులు అందుబాటులోకి తెస్తే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జీఎస్టీతో రూ.42లక్షల వేలం

అద్దె గదులు సుమారు రూ.36లక్షల వేలం పాటలో టెండర్‌దారుడు దక్కించుకోగా రూ.6 లక్షల జీఎస్టీతో కలిపి రూ.42లక్షలు చెల్లించాల్సి వచ్చింది. సుమారు రెండేళ్ల పాటు టెండరుదారుడు గదులు నిర్వహణ బాధ్యత వహించి 2025 మార్చిలో దేవస్థానానికి అప్పగించారు. ఐదు నెలలు కావస్తున్నా గదుల తాళం తీసేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. పాతగుట్ట దేవస్థానం పరిధిలో కూడా 10 అద్దె గదులు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని అధికారుల దృష్టికి తీసుకుపోగా కొత్తగా ఫంక్షన్‌హాల్ నిర్మించేందుకు యోచిస్తున్నామని సమాధానమిచ్చారు. సిబ్బంది కొరత అంటూ దాటవేస్తూ భక్తుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. పట్టణంలో పలు కులసంఘాల భవనాలు వెలిశాయి. పట్టణంలో అనువుగా దేవస్థానానికి చెందిన ఆండాళ్ నిలయం అద్దె గదులు అందుబాటులో ఉన్నప్పటికీ అలంకారప్రాయంగా మారాయి.

దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తాం



ఈ ఏడాది మార్చి నెల నుంచి రెండు పర్యాయాలు టెండర్లు ఆహ్వానించినా ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం దేస్థానం ఆధ్వర్యంలోనే అద్దె గదుల నిర్వహణ చేసేందుకు బాధ్యత తీసుకుంటాం. క్షేత్ర దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు చేయించి అద్దె గదులు అందుబాటులోకి తెస్తాం. పాతగుట్ట వద్ద అద్దె గదులు శిథిలావస్థలో ఉన్నాయి. వాటి స్థానంలో ఫంక్షన్ హాల్ నిర్మించాలని యోచిస్తున్నాం.

దోర్బల భాస్కరశర్మ, ఏఈవో, యాదగిరిగుట్ట దేవస్థానం

26గేట్ల నుంచి కృష్ణమ్మ పరవళ్లు


నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక పెరిగింది. రెండో రోజు బుధవారం కూడా 26క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు (312.0450 టీఎంసీలు)కాగా, ప్రస్తుతం 586అడుగులు(300.3200 టీఎంసీలు)గా ఉంది. మొత్తం 3,11,422 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 2,82,124 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

పర్యాటకుల సందడి

కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్దఎత్తున సాగర్‌కు వస్తున్నారు. బుధవారం సాయంత్రం పైలాన్‌కాలనీ కొత్త వంతెన వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. భద్రతా కారణాల దృష్ట్యా ప్రధాన డ్యాంపైకి పర్యాటకులకు అనుమతి లేకపోవడంతో ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో, కొత్త వంతెన వద్ద నుంచి పర్యాటకులు కృష్ణమ్మ సోయగాలను తిలకించి పరవశిస్తున్నారు. సాగర్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు వెళ్లేందుకు లాంచీలు నడుపుతారు. లాంచీలను రెండేళ్లుగా విజయవిహార్ వెనక వైపున ఉన్న నూతన లాంచీ స్టేషన్ నుంచి నడిపే వారు. ప్రస్తుతం సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద రాక ఉధృతంగా ఉండటంతో పాటు క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నందున లాంచీ స్టేషన్‌ను ఎడమ ఎర్త్ డ్యాం వద్ద ఉన్న డౌన్ పార్కు పుష్కరఘాట్ వద్దకు మార్చారు.

నేరేడుగొమ్ము: శ్రీశైలం ప్రాజెక్టు నుంచి గేట్లు ఎత్తడంతో కృష్ణా పరివాహక ప్రాంతమైన నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీకి వరదనీరు భారీగా పెరుగుతోంది. పెద్దమునిగల్ శివాలయం వరకు కృష్ణాజలాలు చేరాయి. అంబ భవాని ఎత్తిపోతల పనులకు వర్షపునీటితో ఆటంకం కలిగే పరిస్థితి ఏర్పడింది. సంపుహౌస్ అప్రోచ్ కెనాల్‌లోకి భారీగా వరదనీరు చేరడంతో అక్కడ పనులు నిలిచిపోయాయి.

కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా డిండి రిజర్వాయర్‌ను నింపుతాం

డిండి: కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా డిండి రిజర్వాయర్ నింపి ప్రాజెక్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి డిండి ప్రాజెక్టు నీటిని ఆయకట్టుకు విడుదలచేశారు. కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ సీఈ, ఎస్ఈలతో ఇప్పటికే సంప్రదించినట్లు తెలిపారు. ఎగువ నుంచి 400క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


డిండి ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

మూసీ డ్యాం రక్షణ గోడకు మరమ్మతులు కరువు


సీపేజీ రంధ్రాల నుంచి లీకవుతున్న నీరు

కేతేపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలు, హైదరాబాద్ నగరం నుంచి నిరంతరాయంగా వస్తున్న వరద నీటితో ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టానికి చేరుకుని నిండుకుండలా ఉంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 645అడుగులు(4.46టీఎంసీలు)కాగా ప్రస్తుతం 643.08అడుగులు(3.96టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు నిర్మా ణం సందర్భంగా స్కవర్, రెగ్యులేటరీ, క్రస్టుగేట్లతో కూడిన ప్రధాన డ్యాంకు ఇరువైపులా దాదాపు 20అడుగుల వెడల్పుతో రక్షణ గోడలను నిర్మించారు. సూర్యాపేట-నల్లగొండ జిల్లాను కలుపుతూ ఉన్న మూసీ ప్రాజెక్టుకు గల ఈ రక్షణ గోడల మీదుగా ఇరు జిల్లాల నుంచి రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారి ఉంది. ఇక్కడి నుంచి సూర్యాపేట జిల్లాలోని దాదాపు 10గ్రామాల ప్రజలు నిత్యం నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, నల్లగొండకు రాకపోకలు సాగిస్తుంటారు. జలాశయంలోని నీటికి రక్షణగా గోడకు క్రస్టుగేట్ల వైపు సీపేజీ నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రంధ్రాలు పెద్దవికావడం, వాటి వెంట పగుళ్ళు వచ్చి, బుంగలు పడ్డాయి. పగుళ్ల, బుంగల ద్వారా కొన్నేళ్లుగా నీరు లీకవుతోంది.

12 నుంచి ద్వారా పులిచింతల ప్రాజెక్టు నీటి విడుదల

చింతలపాలెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం పులిచింతల ప్రాజెక్టుకు బారీగా వరద నీరు చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 12గేట్లు మూడు మీటర్ల మేర ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం శ్రీశైలం, నాగార్జునసాగర్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో పులిచింతల ప్రాజెక్టులోకి 3,01,567 క్యూసెక్కులు వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 41.586టీఎంసీలుగా ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులకు ప్రస్తుత నీటిమట్టం 172.242 అడుగులకు చేరింది. ప్రాజెక్టు రేడియల్ గేట్ల ద్వారా 2,84,561 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఎడమ వైపున ఉన్న తెలంగాణ విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్‌ఉత్పాదన, విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యం 120 యూనిట్లు కాగా నాలుగు యూనిట్ల నుంచి 100 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. విద్యుత్ ఉత్పాదన కోసం 17వేల క్యూసెక్కుల నీటిని వినయోగిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



ప్రపంచ సైక్లింగ్ పోటీలకు దేవాన్ష్‌రెడ్డి ఎంపిక



వలిగొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పుల్లిగిల్ల గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు కొలను కమలాకర్‌రెడ్డి ఐర్లాండ్ దేశంలో స్థిరపడ్డాడు. ఆయన కుమారుడు దేవాన్ష్‌రెడ్డి ఆ దేశంలో డిగ్రీ చదువుతున్నాడు. కాగా ప్రపంచ సైక్లింగ్ పోటీలకు దేవాన్ష్‌రెడ్డి ఎంపికయ్యాడు. డెన్మార్క్‌లోని కోపెన్ హాగెన్‌లో జూలై 28 నుండి ఆగస్టు 2 వరకు జరుగుతున్న 2025 బీఎంఎక్స్ రేసింగ్ యూసీఐ ప్రపంచ చాంపియన్‌కు ఐర్లాండ్ నుంచి ప్రతినిధ్యం వహిస్తున్నాడు. గతంలో రెండుసార్లు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చినందుకు ఆ దేశ ప్రధానితో చేత ప్రశంస అందుకున్నాడు.

డిగ్రీ స్పాట్ అడ్మిషన్ల గడువు పెంపు

నాగార్జునసాగర్, జూలై30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మహాత్మ జ్యోతి బాపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్ల గడువును ఆగస్టు 6వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మాధవి లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థులు జూలై 31వ తేదీ వరకు దోస్త్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9640811664, 9642046006 నంబర్‌లను సంప్రదించాలని అమె కోరారు.

శాస్త్రోక్తంగా నిత్యపూజలు



యాదగిరిగుట్ట, జూలై 30(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువు దీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీ దళాలతో సహస్రనార్చనలు నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.11,77,677ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రారంభించకుండా కుట్ర

• మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

మోత్కూరు, జూలై30(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు శిష్యుడైన సీఎం రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించకుండా గోదావరిలో మిగులు జలాలు ఉండేలా చూస్తున్నారని, ఆ సాకుతో ఆంధ్ర సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు కట్టుకునేందుకు సహకరిస్తున్నారని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల క్రాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన కార్యకర్తల సమా వేశంలో మాట్లాడారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రారంభిస్తే తెలంగాణలో 50లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు కట్టలేరన్నారు. కేవలం రెండు పిల్లర్లు ఒక్క అడుగు కుంగాయన్న సాకుతో కాళేశ్వరం ప్రాజెక్టును నిం పకుండా 5లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా వదిలేస్తున్నారన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో 17మోటార్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆంధ్ర ప్రాంతవాసులు పోచంపాడు వద్ద చేసిన మోసానికి బదులు తీర్చుకోవడానికే మాజీ సీఎం కేసీఆర్ నీరు లభించే చోట ప్రాజెక్టు నిర్మించాలని భావించి 140 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 240టీఎంసీల నీటిని వాడుకునేలా కాళేశ్వరం నిర్మిస్తున్నామని చెప్పి నాలుగైదు వందల టీఎంసీల నీటిని వాడుకునేలా ప్లాన్ చేశారన్నారు. దాన్ని వినియోగించుకోవడం చేతకాక ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఆంధ్రకు సహకరించేలా కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా తెలంగాణలో నీరు ఎలా పారేది జగదీశ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. తిరుమలగిరి సభలో తాను మంత్రిగా ఉన్నప్పుడు నీరు ఎందుకు తీసుకరాలేదని సీఎం ప్రశ్నించడాన్ని ప్రస్తావిస్తూ తనతో ఎవరొస్తారో రండి ఎస్సారెస్పీ కాల్వల చివరి ఊరి అయిన చినసీతారాం తండాకు వెళుదాం రావాలని, అక్కడ కూడా చివరి రైతు వద్దకు వెళ్లి అడుగుదాం, బీఆర్ఎస్ హయాంలో నీళ్ల వచ్చాయో లేదో, వచ్చాయంటే ఆ రైతు చేత మీరు(తన సవాల్ స్వీకరించి వచ్చిన వారు) చెప్పుతో కొట్టించుకోవాలి, రాలేదంటే నేను కొట్టించుకుంటానని సవాల్ విసిరారు.

కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత నాదే : గాదరి

తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్న పదేళ్ల ఎవరిపైనా కేసు పెట్టలేదని, అభివృద్ధే లక్ష్యంగా పని చేశామన్నారు. ఎమ్మెల్యే సామేలు, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వగ్రామాల్లో ఏ ఊరికైనా వెళ్దాం.. ఆ ఊరిలో రైతులందరికీ రుణమాఫీ అయ్యిందా అని అడుగుదాం అని నేను సవాల్ చేస్తే ఆ సవాల్‌ను స్వీకరించకుండా తానేదో సభను అడ్డుకుంటానన్నట్టుగా తప్పుడు ప్రచారం చేసి తనను హౌస్ అరెస్టు చేశారన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాకు ఐదారేళ్ల ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీరందిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాల్వలను ఎండబెట్టిందన్నారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ హుజూర్‌నగర్ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు నేవూరి ధర్మేందర్‌రెడ్డి, మదర్‌డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పొన్నెబోయిన రమేష్, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, శ్రీరాముల జ్యోతిఅయోధ్య, చిప్పలపల్లి మహేందర్ పాల్గొన్నారు. మోత్కూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎండీ. అమీర్, మహేశ్వరం హనుమంతు, నల్లబోతు వెంకట్ తదితరులు మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశం ముగిసిన తర్వాత కార్యకర్తలంతా భోజనానికి వెళ్లగా, ఇదే అదునుగా జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించి కార్యకర్తల జేబుల్లోంచి డబ్బులు కాజేశారు.

క్రీడల్లో రాణించి దేశానికి పేరు తేవాలి


క్రీడాకారులను సన్మానిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, జూలై 30(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించి దేశానికి పేరు తేవాలని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి కోరారు. అంతర్జాతీయ క్రీడల్లో భాగంగా నార్వేలో ఆగస్టు 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే స్లంసాకర్(ఫుట్‌బాల్) హోంలెస్ ఇంటర్నేషనల్ వరల్డ్ కప్ పోటీలకు నల్లగొండకు చెందిన క్రీడాకారిణి మద్దినాల లావణ్య ఎంపికైంది. అదేవిధంగా క్రీడాకారిణి పవిత్ర హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఫీఫా అకాడమికి ఎంపికైంది. వారిని బుధవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ కె. దాసు, సునిత, రజిత, రఫీ, సిద్ధార్థ, సోనీ, సాగర్, కత్తుల కోటి పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళికను అమలు చేయాలి

దేవరకొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటిల్లో వంద రోజుల పట్టణ ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని మునిసిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మునిసిపల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. డంపింగ్‌యార్డు నిర్వాహణ, శానిటేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2024-25 సంవత్సరానికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రంలో దేవరకొండ మునిసిపాలిటీ 21వ ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం దేవరకొండ ఖిల్లాలోని పార్కును సందర్శించి మొక్కలునాటారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ఏఈ రాజు, శానిటరి ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, మేనేజర్ రాకేష్, అధికారులు ఉన్నారు.

రామగిరి: నల్లగొండ పట్టణంలో ఉన్న ప్రతి ఇంటికీ అసెస్‌మెంట్‌చేసి ఆస్తి పన్ను పెంపునకు కృషి చేయాలని మునిసిపల్ జాయింట్ డైరెక్టర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం పట్టణంలోని డంపింగ్ యార్డు, వివిధ వార్డుల్లో పర్యటించారు. అనంతరం కార్యాలయంలో మహిళా సంఘాలు, వార్డు ఆఫీసర్లు, ఆఫీస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అసెస్‌మెంట్ ఉండి ట్రేడ్ లైసెన్స్ లేని వాణిజ్య సంస్థలు కూడా గుర్తించాలన్నారు. ఆన్‌లైన్‌లో ఉన్న నల్లా కనెక్షన్లు, గృహ నిర్మాణ సంఖ్యను చూసి ఆశ్చర్య వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి నల్లా కనెక్షన్‌ను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఫాంలాండ్ వెంచర్లలో అనుమతులులేని నిర్మాణాలపై దృష్టిసారించాలన్నారు. సమావేశంలో మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ శివరాంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్ ఉన్నారు.


దేవరకొండలో పార్క్, మునిసిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్

నాగార్జునసాగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సాగర్ బీసీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3,4 తేదీల్లో హన్మకొండలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 28వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. నందకిశోర్(పరుగు పందెం), రవి తేజ(లాంగ్‌జంప్), చందు(షాట్‌పుట్), గణేష్(ట్రైథ్లాన్-ఏ), సాయిచరణ్, శివ, చరన్(ట్రైథ్లాన్-సి) ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్‌యాత్రను బుధవారం జిల్లాకేంద్రంలో ప్రారంభించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప ఆచరణ మాత్రం గడప దాటడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, ఖమ్మంపాటి శంకర్, సైదానాయక్, కుంచం కావ్య, కోరే రమేష్, బుకింగ్ వేంకటేష్ పాల్గొన్నారు.

పాఠశాల బ్యాంకు.. భలే బాగు



స్కూల్‌బ్యాంకుపై డెమోలో పాల్గొన్న విద్యార్థినులు

- విద్యార్థులకు పొదుపు అలవాట్లు నేర్పడమే లక్ష్యం
- విద్యార్థులందరికీ స్కూల్ బ్యాంకు ఖాతాలు
- బ్యాంకు కార్యకలాపాలపై ఇప్పటికే డెమో

విద్యార్థులకు పొదుపు అలవాట్లు నేర్పడమే లక్ష్యం గా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయు లు ఓ బృహత్తర కార్యక్రమానికి నాంది పలుకుతున్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించి మరుగున పడిన 'సంచయిక' లాంటి వ్యవస్థను మళ్లీ పరిచయం చేస్తున్నారు. జిల్లాలో ఏ పాఠశాలలోనూ లేని విధంగా పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ బ్రాహ్మణవెల్లెంల పేరిట వినూత్నంగా 'స్కూల్ బ్యాంకు'ను ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల కోసం.. విద్యార్థుల చేత.. విద్యార్థులే స్వయంగా బ్యాంకు దినసరి కార్యకలాపాలు నిర్వహించేలా పకడ్బందీ విధానాన్ని రూపొందించారు. ఆగస్టు 15న స్కూల్ పాఠశాల బ్యాంకును లాంఛనంగా ప్రారంభించాలని బ్యాంకింగ్ కార్యకలాపాల పై విద్యార్థులకు డెమో నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి

వర్తమాన సమాజంలో ప్రతి విద్యార్థీ ఇష్టారీతిన డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఏడ్చి.. బతిమాలి తల్లిదండ్రుల వద్ద వసూలు చేసిన డబ్బులను చిరుతిండ్లకు, నిరర్థకమైన ఖర్చులకు వినియోగిస్తున్నారు. వారిలో వృథా ఖర్చును తగ్గించే ఆలోచనలో భాగంగానే ప్రధానోపాధ్యాయుడు కూకుట్ల నర్సింహ ఆలోచనలకు అనుగుణంగా ఉపాధ్యాయులందరూ సమష్టిగా ఆలోచించి పాఠశాల బ్యాంకు నిర్వహణకు మెరుగులు దిద్దారు. విద్యార్థుల్లో పొదుపు అలవాటు, ఆవశ్యకత, డబ్బుల విలువ, బ్యాంకింగ్ రంగం పట్ల అవగాహన రానుంది. తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులను పొదుపుగా వాడుకుని అవసరమైన వాటికి మాత్రమే ఖర్చు చేసేలా వారి ఆలోచనల్లో మార్పు తీసుకురావాలనేదే ఈ స్కూల్ బ్యాంకు ఏర్పాటు ఉద్దేశం. పాఠశాలలో ప్రస్తుతం ఉన్న 180 మంది విద్యార్థులతో స్కూల్ బ్యాంకు ఖాతాలు తెరిపించనున్నారు. బ్యాంకులో ఖాతా తెరవడానికి, డబ్బులు డిపాజిట్,విత్ డ్రా చేయడానికి సులభంగా పూరించగలిగేలా ఓచర్లు కూడా సిద్ధం చేశారు. గతంలో ఉన్న సంచయిక పుస్తకాన్ని కొన్నాళ్ల పాటు బ్యాంక్ పాస్‌బుక్‌గా వినియోగించనున్నారు.



విద్యార్థులే నిర్వాహకులు

ఉపాధ్యాయులు కేవలం పర్యవేక్షకులుగా విద్యార్థులే స్కూల్ బ్యాంకు కార్యకలాపాలను నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం ఆసక్తి కనబరిచే ఎంపిక చేసుకున్న విద్యార్థులకు బ్యాంకు కార్యకలాపాల నిర్వహణపై ఇప్పటికే తర్ఫీదునిచ్చారు. ప్రతీ క్లాస్‌లో ఓ విద్యార్థి ఈ బ్యాంకు కార్యకలాపాలను నిర్వహించనున్నారు. రోజు వారీగా విద్యార్థుల నుంచి డిపాజిట్లు సేకరించడం.. అవసరమైన వారికి తిరిగి ఇవ్వడం నిల్వ బుక్‌లను నిర్వహించడం వంటి కార్యకలాపాలపై శిక్షణ పొందారు. కనీసం రూ.10లకు తగ్గకుండా రూ.100లకు మించకుండా విద్యార్థుల నుంచి డిపాజిట్లు చేసేలా నిబంధన విధించారు. రోజువారీగా విద్యార్థులు స్కూల్ బ్యాంకులో జమచేసిన డబ్బులను స్కూల్ బ్యాంకుఇన్‌చార్జిగా ఉండే ప్రభుత్వ ఉపాధ్యాయుడు, హెచ్ఎంల జాయింట్ అకౌంట్ కింద తెరిచే వాణిజ్య బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు.


బ్యాంకు నిర్వహణపై డెమో ఇచ్చాం



స్కూల్ బ్యాంకు నిర్వహణపై ఇప్పటికే విద్యార్థులందరికీ డెమో ఇచ్చాం. స్కూల్ బ్యాంకు ఏర్పాటు ఉద్దేశాన్ని వారికి చెప్పాం. బయటి బ్యాంకుల వలే ఈ స్కూల్ బ్యాంకును నిర్వహించేలా వ్యవస్థ ఏర్పాటు చేశాం. బ్యాంకు నిర్వహణ కోసం ప్రతీ తరగతిలో ఓ విద్యార్థిని నియమిస్తాం. డబ్బులు డిపాజిట్, విత్ డ్రాకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించేలా చూస్తాం. విద్యార్థుల వద్ద పాసుబుక్, మా వద్ద రికార్డులో స్పెసిమెన్ సిగ్నేచర్‌నే సంతకాలుగా తీసుకుంటాం. విద్యార్థి ఈ స్కూల్ నుంచి టీసీ తీసుకుని వెళ్లే సమయంలో డబ్బులు పూర్తిగా చెల్లించి స్కూల్ బ్యాంకు ఖాతాను మూసివేస్తాం.

- నరేశ్, స్కూల్ బ్యాంకు ఇన్‌చార్జి, బీ.వెల్లెంల జడ్పీహెచ్ఎస్

విద్యార్థులకు పొదుపు గురించి నేర్పాలనే



గతంలో ప్రతి ఇంట్లో డిబ్బీలు ఉండేవి. నాణేలు, నోట్లను చిన్నారులు ఆ డిబ్బీలో దాచుకునేవారు. కానీ కాలక్రమేణా అవి కనబడడం లేదు. విద్యార్థులు కూడా వృథా ఖర్చు మట్ల మక్కువ చూ పుతున్నారు. చిరుతిండ్లకు ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. ఇప్పటి నుంచే విద్యార్థుల్లో పొదుపు అలవాటును ప్రేరేపించాలనే సదుద్దేశంతోనే స్కూల్ బ్యాంకు ఏర్పాటుకు సంకల్పించాం. తరగతుల నిర్వహణకు ఎలాంటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. వీలైనంత వరకు క్రాఫ్ట్ లేదా విశ్రాంతి పీరియడ్‌లోనే విద్యార్థులు బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించుకునేలా సూచనలిస్తాం.

- నర్సింహ, హెచ్ఎం, బీ.వెల్లెంల జడ్పీహెచ్ఎస్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఎం.వేణుగోపాలచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో శివాజీనగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

గ్రోమోర్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఏవో

కనగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.లింగోటం స్టేజీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గ్రోమోర్ రైతు సేవా కేంద్రాన్ని ఏవో అమరేందర్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. పంటల సాగుకు అవసరమైన ఎరువులు, మందులు, డ్రోన్లు, భూసార పరీక్షలు కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు గ్రోమోర్ కేంద్రం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రోమోర్ ప్రతినిధులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వేయర్ లేక అవస్థలు




కట్టంగూరు తహసీల్దార్ కార్యాలయం

- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- పెండింగ్‌లో సర్వే దరఖాస్తులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

కట్టంగూరు, జూలై30(ఆంధ్రజ్యోతి): మండలంలో రెగ్యులర్ సర్వేయర్ లేకపోవడంతో ఏడాదిన్నర నుంచి రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యలతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతీ రోజూ భూసర్వే కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులను పట్టించుకునే వారే కరువయ్యారు. కట్టంగూరు మండలానికి కొన్ని నెలల నుంచి రెగులర్ సర్వేయర్ లేకపోవడంతో ఇన్‌చార్జి సర్వేయర్ నియమించారు. అప్పటి నుంచి రైతులకు తిప్పలు తప్పడం లేదు. కొన్ని రోజులు పాటు కేతేపల్లి మండల సర్వేయర్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ప్రస్తుతం నకిరేకల్ సర్వేయర్ ఇన్‌చార్జిగా ఉన్నా రైతులకు అందుబాటులోకి రాకపోవడంతో వారి బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సతమతమవుతున్నారు. మీ సేవలో సర్వే కోసం దరఖాస్తు చేసుకొని నెలల తరబడి వేచిచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మండలవ్యాప్తంగా సర్వే పెట్టుకున్న దరఖాస్తులు రోజురోజుకు పెరిగిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కట్టంగూరు మండల వ్యాప్తంగా 22 గ్రామ పంచాయతీలతో పాటు మరో 2 ఆవాస ప్రాంతాలు ఉన్నాయి. మండలవ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 80 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని నెలల నుంచి ఇన్‌చార్జిగా ఉన్న నకిరేకల్ సర్వేయర్ ఎప్పుడు వస్తాడో? ఎప్పుడు వెళతారో? తెలియని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. భూసర్వే కోసం రైతుల మీసేవలో చలానాలు కట్టినా నెలల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో డబ్బులు వెచ్చించి ప్రైవేట్ సర్వేయర్లతో భూములను సర్వే చేయించుకుంటున్నామని అన్నదాతలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ సర్వేయర్ నియమించాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావును వివరణ కోరగా మండలంలో సర్వేయర్ కొరత నిజమేనని అన్నారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్, ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నకిరేకల్ సర్వేయర్‌ను కట్టంగూరుకు పంపించాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

చలాన్ కట్టి 20 నెలలు



భూమి సర్వే కోసం చలాన్ (టీపన్) కట్టి సుమారు 20 నెలలు అవుతుంది. కార్యాలయం చుట్టూ తిరిగి చెప్పులు అరుగుతున్నాయే తప్ప సర్వేయర్ దొరకడం లేదు. ఈదులూరు గ్రామంలో సర్వే నెంబర్ 145లో 1.10 ఎకరాల భూమిని సర్వే చేయడం కోసం చలాన్ కట్టారు. రెవెన్యూ అధికారులు రెండు సార్లు నోటీసులు ఇచ్చినా సర్వేయర్ అందుబాటులోకి రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలి.

- దాసరి యాదగిరి, రైతు, ఈదులూరు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రభుత్వ ఆస్పత్రిలోనే మెరుగైన సేవలు

డాక్టర్ శంకర్‌నాయక్, సూపరింటెండెంట్



ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు మండలంలోని కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌నాయక్ అన్నారు. నిరుపేదలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు పొందాలని అన్నారు.

(మర్రిగూడ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్య నిపుణులు ఉన్నారా? ఎంత మంది వైద్యులు ఉండాలి?

డాక్టర్: మండలకేంద్రంలోని 30పడకల ఆస్పత్రిలో 15మంది వైద్య నిపుణులు ఉండాలి. స్పెషలిస్టులతో కలిపి కేవలం ఐదుగురు వైద్యులు మాత్రమే ఉన్నారు.పూర్తిస్థాయిలో వైద్యులు లేరు.

ఆంధ్రజ్యోతి: ఐదుగురు వైద్య నిపుణులతోనే రాత్రి సమయంలో పూర్తిస్థాయిలో అత్యవసర వైద్య సేవలు ఏ విధంగా అందిస్తున్నారు?

డాక్టర్: ఐదుగురు వైద్యులు ఉన్నా రాత్రి వేళలో అత్యవసర వైద్యసేవలు అందించడానికి ఒక డాక్టర్ అందుబాటులో ఉంటున్నారు.

ఆంధ్రజ్యోతి: రోజుకు ఎంతమందికి వైద్యసేవల కోసం వస్తున్నారు? మందుల కొరత ఏమైనా ఉందా?

డాక్టర్: రోజుకు వైద్య సేవల కోసం 250 నుంచి 300 మంది ఆస్పత్రికి వస్తారు. ప్రస్తుతానికి మందుల కొరత ఏమి లేదు.

ఆంధ్రజ్యోతి: కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎప్పుడు ప్రారంభిస్తున్నారు?

డాక్టర్: కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయటానికి జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినప్పుడు ఆపరేషన్లు ప్రారంభిస్తాం.

రాజకీయ రణభేరిని విజయవంతం చేయాలి

నకిరేకల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆగస్టు 3వ తేదీన నిర్వహించే ఆర్యవైశ్య రాజకీయ రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైశ్య వికాస వ్యవస్థాపక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. నకిరేకల్‌లో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైశ్య రాజకీయ సమావేశంలో రణభేరి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు గజ్జెల రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు వీరవెల్లి రఘునాథ్, ఉప్పల సంతోష్, ఈశ్వరయ్య, శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు కోటగిరి దైవాదీనం, సోమ యాదగిరి, మంచుకొండ సోమయ్య, కృష్ణమూర్తి, గుండా వెంకటయ్య, ఉప్పల రమేష్, వీర్లపాటి జానయ్య, బ్రహ్మదేవర రవిశంకర్, గుండా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


నకిరేకల్‌లో ఆర్యవైశ్య సమావేశంలో మాట్లాడుతున్న కాచం సత్యనారాయణ

యూరియా అక్రమదందాపై విచారణ చేపట్టాలి

● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్‌లో జరుగుతున్న యూరియా అక్రమదందాపై పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. చిట్యాలలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు వెయ్యి బస్తాల యూరియా పక్కదారి పట్టిందన్నారు. యూరియా అక్రమ దందాలో అసలు సూత్రధారులకు వదిలిపెట్టి ఒక అమాయిక అటెండర్‌పై నేరాన్ని మోపే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. పీఏసీఎస్ చైర్మన్ రఘుమారెడ్డి సొసైటీని భ్రష్టు పట్టించారని, ఏడాది కాలంలో సొసైటీలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్యయాదవ్, మాజీ ఎంపీపీ కొలను సునీతవెంకటేష్ మాజీ ఎంపీటీసీ పెద్దబోయిన సత్తయ్య, నాయకులు కూరెల్ల లింగస్వామి, లక్ష్మయ్య, శివశంకర్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విచారణలో నిజాలు వెలుగుచూస్తాయి

● వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి

చిట్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్‌లో యూరియా అక్రమదందా జరిగిందని మాజీ ఎమ్మెల్యే లింగయ్య అసత్య ఆరోపణలు చేస్తున్నారని వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కాటం వెంకటేశం అన్నారు. బుధవారం చిట్యాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. యూరియా కొనుగోలు చేస్తున్న యాడ్‌బ్లూ కంపెనీ వెలిమినేడు గ్రామ పరిధిలో ఉండటం వల్ల వెలిమినేడు పీఏసీఎస్‌కు అంటగడుతున్నారని విమర్శించారు. వెలిమినేడు పీఏసీఎస్‌లోని యూరియాలో ఎటువంటి అక్రమాలు జరగలేదని పేర్కొన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారని, నిజనిజాలు త్వరలోనే బయటకు వస్తాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, పీఏసీఎస్ డైరెక్టర్ మామిడి శ్రీరాములు, అద్దెల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు వెంటనే పట్టాలు ఇవ్వాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య

నల్లగొండరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూం ఇళ్ల సాధన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అర్డ ర్స్ ఇవ్వాలని కోరారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తయి నా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారుల తరఫున సీపీఎం అనేక ఆందోళనలు కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం రూ. రెండు కోట్లు కేటాయించిందని, ఆ నిధులతో చేపడుతున్న అంతర్గత రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాల కల్పన పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. త్వరితగతిన మౌలిక సదుపాయాల పనులు పూర్తిచేసి ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చి స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గంజి నాగరాజు, ప్రశాంతి, రాజేష్, గౌసియా పాల్గొన్నారు.

శ్రీలత మృతిపై పోలీసుల విచారణ

మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

నల్లగొండ క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బోయవాడలో సిరిపంగి శ్రీలత (23) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మునుగోడు మండలం ఉకొండి గ్రామానికి చెందిన జాల నాగరాజును ప్రేమ పేరుతో మోసం చేసి తన కుమార్తెను హత్య చేశాడని మృతురాలి తల్లి రేణుక నల్లగొండ టూటౌన్ పోలీ స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నాగరాజుపై హత్యతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన విచారణ చేపడుతున్నారు. డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ ఈ కేసులో సమగ్ర విచారణ జరిపి త్వరలో నిందితుడు జాల నాగరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నల్లగొండరూరల్: శ్రీలత మృతికి కారణమైన నిందితులను వెంటనే శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురి వద్ద బుధవారం శ్రీలత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీలత ఎలా మృతి చెందిది? హత్యనా? ఆత్మహత్యనా? అనే విషయం విచారణలో తేల్చాలన్నారు. ఆమె మృతికి కారకులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రంలో దళితులపై పరువు, కుల హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీలత కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు, ఇతర సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు ముడిసరుకు పట్టివేత

నార్కట్‌పల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): కల్తీ కల్లు తయారీకి రవాణా చేస్తున్న ముడి సరుకును నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నార్కట్‌పల్లిలో పట్టుకున్నారు. బుధవారం నార్కట్‌పల్లిలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. దాడుల్లో కల్తీ కల్లులో వాడే కోరల్ హైడ్రేట్ అనే ముడిసరుకు సుమారు 30కిలోల మేర పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముడి సరుకును రవాణా చేస్తున్న వెంకన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు.

నూతన షట్టర్లకు ఏర్పాటుకు ప్రతిపాదనలు

● ఐబీ ఈఈ సత్యనారాయణ

శాలిగౌరారం, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టుకు షట్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి ఈఈ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన శాలిగౌరారం ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వ షట్టర్లు శిథిలమయ్యాయని, నూతన షట్టర్ల శెట్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. గతంలో మధ్యంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టు మరమ్మతు పనులను నిధులు మంజూరీ కాగానే పూర్తి చేయిస్తానన్నారు. మొదట ఆయన మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆయన వెంట జేఈ విక్రమ్, ఏఈ హరి, రైతు సంఘం నాయకులు చామల వెంకటరమణారెడ్డి తదితరులు ఉన్నారు.


శాలిగౌరారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఐబీ ఈఈ సత్యనారాయణ

సమాచారం

సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పాముగుల్ల అచ్చాలు డిమాండ్ చేశారు. బుధవారం చిట్యాలలో జరిగిన గీత కార్మిక సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 2 నుంచి 18వ తేదీ వరకు కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మోటార్ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు మామిడి హనుమంతు, గునగంటి కృష్ణయ్య, నకిరేకంటి రాములు, గునగంటి సైదులు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

మర్రిగూడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అటవీశాఖ సెక్షన్ అధికారి ఉదయ్ అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో బుధవారం మునుగోడు డివిజన్ అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కలు వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ అభిషేక నవీన్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకట్, నరేష్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

శాలిగౌరారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని లయన్స్ క్లబ్ జిల్లా డీసీ సభ్యుడు డెంకల సత్యనారాయణ అన్నారు. శాలిగౌరారంలోని కేజీబీవీ స్కూల్, లయన్స్ క్లబ్ పీఐడీ, ఎల్‌సీవోఐ చైర్‌పర్సన్ ఘట్టమనేని బాబురావు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవరుచుకోవాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో నాగమణి, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్, కోశాధికారి గుండు పరమేష్, సభ్యులు వెంకన్న, శ్రీనివాస్, చిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి దీవెనలు ఉండాలి : ఎమ్మెల్యే


విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం పుష్ప దంపతులు

నార్కట్‌పల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణ ప్రజలపై గ్రామ దేవత రేణుకా ఎల్లమ్మ తల్లి దీవెనలు ఉండాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలోని స్ఫూర్తి కళాశాల సమీపంలో గురిజ అశోక్‌స్వామి నిర్మించిన నూతన దేవాలయంలో బుధవారం నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ, కాళికామాత, శివలింగం, మహాగణపతి విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకల్లో ఆయన సతీమణి పుష్పతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త ఆలయాల నిర్మాణంతో భక్తి భావం పెరుగుతుందని అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకరిస్తానన్నారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ శాంతికల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, సిద్దగోని స్వామిగౌడ్, బింగి కొండయ్య, వేముల సత్యం, ప్రజ్ఞాపురం సత్తి, మాదాసు నర్సింహ, మహేష్, గురిజ రామచంద్రం, బీఆర్ఎస్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, పుల్లెంల ముత్తయ్య, ప్రజ్ఞాపురం రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం నడిపిస్తున్న ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శ్రీనాథ్ కోరారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాలిగౌరారం మండలానికి వివిధ రూట్లలో నడిపించే మూడు బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికులు ఆర్టీసీని ఆదరిస్తే నకిరేకల్ - శాలిగౌరారం రూట్‌లో మరిన్ని బస్సులు నడిపిస్తామన్నారు. విద్యార్థులు, ప్రయాణికుల సౌకర్యార్థం కోసం బస్సులను నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

90 మందికి కంటి పరీక్షలు

కేతేపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ గ్రామంలో నకిరేకల్ లయన్స్ క్లబ్, నవ్య క్లబ్ ఆధ్వర్యాన బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కంటి వైద్యశిబిరంలో సూర్యాపేట లయన్స్ క్లబ్ సహకారంతో గ్రామస్థులకు ఉచితంగా కంటి పరీక్షలు, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 9 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. అలాగే 59మందికి షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు గుర్తించిన 9 మందిని సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో నకిరేకల్ లయన్స్ క్లబ్, నవ్య క్లబ్ అధ్యక్షులు రేపాల సతీష్, ఎన్.రమాదేవి, మార్కెట్ డైరెక్టర్ ఎస్కె.లతీఫ్, లయన్స్ ట్రస్టు చైర్మన్ ఎన్.రామ్మోహన్‌రావు, క్లబ్ కార్యదర్శి సూర్యచంద్రారావు, ఉప్పల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకోవాలి


ప్రమాణస్వీకారం చేసిన డీపాల్ స్కూల్ క్యాబినెట్‌తో ఎస్ఐ సతీష్

కేతేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎస్ఐ సతీష్‌వర్మ అన్నారు. మండల కేంద్రం కేతేపల్లిలోని డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల స్కూల్‌లో ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎస్ఐ సతీష్‌వర్మ పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్ స్కూళ్లకన్నా పల్లెటూరి వాతావరణంలో ఉండే పాఠశాలల్లోనే బోధన సహజంగా ఉంటుదని అన్నారు. విద్యార్థులు, యువత సినిమాల్లో ఉండే మంచిని గ్రహించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా స్కూల్ క్యాబినెట్‌కు ఎన్నికైన హౌజ్ బోయ్స్ హౌజ్‌గర్ల్స్‌ను స్లాష్‌తో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ షాజు జార్జి, వైస్ ప్రిన్సిపాల్ రంజిత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌షాపుల వద్ద మోదీ బొమ్మ పెట్టాలి



రేషన్‌షాపును సందర్శించి మోదీ బొమ్మ పెట్టాలని సూచిస్తున్న శ్రీదేవిరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రతీ రేషన్‌షాపు వద్ద ప్రధాని నరేంద్రమోదీ బొమ్మతో కూడిన ఫ్లెక్సీని పెట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మండల ప్రభారి శ్రీదేవిరెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా బుధవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వారిజాల వేణుగోపాల స్వామి ఆలయం, దళితవాడ, రేషన్‌షాపులను దుకాణాలను ఆమె బీజేపీ నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీదేవిరెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ ఎంతో చిత్తశుద్ధితో ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఈజీఎస్ కింద వేస్తున్న సీసీ రోడ్లు, మరుగుదొడ్లు, వైకుంఠధామాలు అన్నీ కేంద్రప్రభుత్వ నిధులతోనే నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు ప్రణాళికతో ముందుకుసాగాలని సూచించారు. సమావేశంలో స్థానిక ఎన్నికల మండల ఇన్‌చార్జి పజ్జూరి వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, బిళ్లకంటి శ్రీకాంత్, అక్కెనపల్లి సత్తయ్య, పురుషోత్తంరెడ్డి, శ్రవణ్‌కుమార్, గణేష్, రామలింగం, నడింపల్లి పార్థసారథి, ఉండ్రాతి నవీన్, రమేష్, శివ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'చేయూత' జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

నార్కట్‌పల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడలో ఆగస్టు 1న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే చేయూత పెన్షన్‌దారుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి ఎరసాని గోపాల్ తెలిపారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ రిజర్వేషన్ల కోసం మంద కృష్ణ ఆధ్వర్యంలో ఆవిర్భవించిన ఎంఆర్‌పీఎస్ పలు సామాజిక అంశాలపై కూడా పోరాటం చేసిందన్నారు. ఆరోగ్యశ్రీ, వికలాంగుల పెన్షన్ల కోసం పోరాటం చేసిందని గుర్తుచేశారు. చేయూత పెన్షన్‌దారుల సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు నక్క అశోక్, కృష్ణ, రమేశ్, లక్ష్మారెడ్డి, గడ్డం ఉపేందర్, చిక్కుల వెంకన్న, అచ్చిరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


లింగయ్యను అభినందిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

చిట్యాలరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామ మాజీ ఉపసర్పంచ్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో డెయిరీ డెవలప్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి నివాసంలో మాజీ ఉపసర్పంచ్ ఉయ్యాల లింగయ్య ఆయన సోదరుడు సైదులు పార్టీలో చేరారు. వారిని అమిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, నాయకులు జన్నపాల శ్రీను, లింయ్య పాల్గొన్నారు.

గరిష్ఠం 32.5
కనిష్ఠం 24.2

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586 (300.3200)	2,82,124	3,11,422
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.08 (3.96)	883.44	644.27
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.242	3,01,567	3,01,567

చికెన్ ధరలు | లైవ్ : రూ.144 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.245

ప్రభుత్వంలో ఆర్టీసీతో పాటు ఆ సంస్థ ఉద్యోగుల విలీన ప్రక్రియపై నీలి నీడలు అలుముకున్నాయి. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం సైతం నాన్చుడు ధోరణి అవలంబిస్తోందని ఆర్టీసీ కార్మికులు విమర్శిస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



విలీనం ఊసేదీ?



» ప్రభుత్వ నిర్ణయం కోసం ఆర్టీసీ కార్మికుల ఎదురుచూపు » యూనియన్ల పునరుద్ధరణ లేక అటకెక్కిన డిమాండ్లు

నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఏడు డిపోలు ఉన్నాయి. దేవరకొండ, కోదాడ, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, యాదగిరిగుట్ట డిపోలో ఉన్న కార్మికులు, ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీలో డ్రైవర్ పోస్టులు, కార్మికులు, కండక్టర్ పోస్టులు ఖాళీగా ఉండగా, వాటి భర్తీని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీనికి తోడు కొత్తగా ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెట్టి డ్రైవర్లను కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకుంటుండటంతో ఇప్పటికే ఖాళాగా ఉన్న పోస్టులను సంస్థ భర్తీ చేస్తుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు గత ప్రభుత్వం అసెంబ్లీ, శాసనమండలిలో బిల్లు పాస్‌చేసి గవర్నర్‌కు నివేదించింది. ఆ తరువాత వివిధ అటంకాల అనంతరం ఆ బిల్లుకు ఆమోదం లభించినా అమలుకునోచుకోలేదు. చివరికి అపాయింట్‌మెంట్ డేట్‌ను ప్రకటించ గా, ఎన్నికల కోడ్ కారణంగా ఆ ప్రక్రియ నిలిచింది. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఆర్టీసీ, ఉద్యోగులను విలీనం చేస్తామని హామీ ఇవ్వగా, ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు దాటుతున్నా విలీనం ఊసే లేదు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల నేతలతో ఇప్పటి వరకు చర్చలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం విలీనంపై ప్రణాళికను సిద్ధం చేయకపోవడంతో అసలు ఉంటుందా? లేదా? అని ఉద్యోగ, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. సంస్థ ప్రభుత్వంలో విలీనమైతే కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారడంతోపాటు పేస్కేల్ లభిస్తుంది.

భర్తీకాని ఖాళీ పోస్టులు

నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలో పదేళ్ల క్రితం వరకు 3,500మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేసే వారు. అందులో ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానాలను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోల పరిధిలో 1,700 నుంచి 2వేల మంది లోపే ఉద్యోగ, కార్మికులు పనిచేస్తున్నట్టు సమాచారం. ప్రధానంగా కార్మికులు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంతో పాటు 2021 పేస్కేల్, ఉద్యోగ భద్రత, యూనియన్‌ల పునరుద్ధరణ, రిటైర్డ్ ఉద్యోగులకు 2017 పేస్కేల్ బకాయిలు, కార్మికుల నియామకాలు రెగ్యులర్ ప్రాతిపాదికన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలని, ముఖ్యంగా కార్మికులపై పనిభారం తగ్గించాలని కోరుతున్నారు. పనిభారంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో యూనియన్లు రద్దయ్యాయి. యూనియన్‌లు ఉన్నప్పుడు రీజియన్ వ్యాప్తంగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేవారు. గెలుపొందిన సంఘాలు రీజియన్‌తో పాటు రాష్ట్ర స్థాయిలో ఉద్యోగుల కార్మికుల హక్కుల కోసం పోరాడేవి. ప్రస్తుతం యూనియన్లు లేకపోవడంతో సమస్యలపై ప్రశ్నించే గొంతులు లేకుండా పోయాయి. ప్రైవేట్ బస్సులు రావడంతో డ్రైవర్ల భర్తీ జరగడం లేదు. ప్రైవేట్ డ్రైవర్లతోటే ఎలక్ట్రికల్ బస్సులు నడిపిస్తున్నారు. ఎలక్ట్రికల్ బస్సుల మానిటరింగ్ మొత్తం హైదరాబాద్ నుంచే సాగుతోంది. దీనికి తోడు చాలా బస్సులు టికెట్‌ల కోసం డ్రైవర్లకే టిమ్స్ యంత్రాలు ఇచ్చారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి టికెట్‌లు ఇవ్వడంతో కండక్టర్ పోస్టుల భర్తీ కూడా లేకుండాపోతోంది.

ఉద్యోగుల్లో అభద్రతా భావం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక హామీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. అయితే ఈ పథకం అమలుచేసినందుకు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సి న రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో మంజూరుచేయడం లేదని సంఘాలు విమర్శిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీకి ప్రభుత్వం రూ.300 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్న ర గడిచినా ఆర్టీసీ విలీన ప్రక్రియపై ఎలాంటి చర్చలు నిర్వహించకపోవడం, ఎలాంటి నిర్ణ యం తీసుకోకపోవడంతోపాటు రూ.300 కోట్ల బకాయి చెల్లింపులో చేస్తున్న తాత్సారంతో సంస్థపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని విమర్శిస్తున్న యూనియన్లు వీటిని ఉదాహరణగా చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం ఆర్టీసీ కార్మికులు దశల వారి ఆందోళన లు చేశారు. సమ్మెకు సైతం పిలుపు ఇవ్వడంతో ప్రభుత్వం యూనియన్లతో చర్చించి

- మిగతా 6వ పేజీలో...

ఆర్టీసీకి పెరిగిన ఆక్యుపెన్సీ

(ఆంధ్రజ్యోతి, సూర్యాపేటఅర్బన్): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ అవకాశం కల్పించడంతో సంస్థ ఆక్యుపెన్సీ పెరిగింది. గతంలో ఆక్యుపెన్సీ 65శాతం ఉంటే ప్రస్తుతం 95శాతానికి చేరింది. జీరో టికెట్ కారణంగా బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో పల్లెవెలుగు బస్సులు 190 ఉండగా, అద్దెకు బస్సులు 172 వరకు ఉన్నాయి. అదేవిధంగా ఎక్స్‌ప్రెస్‌లు 116 ఉండగా, 66 అద్దె ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆర్టీసీకి ప్రతీ రోజు సుమారు రూ.2కోట్లు, నెలకు రూ.60కోట్ల వరకు ఆదాయం వస్తోంది.

ఆర్టీసీ బస్సుల్లో
కానరాని మెడికల్ కిట్లు
ఆపద వస్తే అందని ప్రథమ చికిత్స 6

పన్ను బకాయిలు రూ.10కోట్లకు పైనే..

» ఆశ్చర్యపరుస్తున్న గణాంకాలు » మిషన్ భగీరథ లెక్కలు కలవడమే కారణమా?

పట్టణానికి చెందిన ఓ ఇంటి యజమాని ఇంటి, నల్లా పన్ను ఎప్పటికప్పుడు చెల్లిస్తూనే ఉన్నాడు. అయితే మిషన్ భగీరథ నీటి పన్ను చెల్లించాలంటూ అతడికి మునిసిపల్ కార్యాలయం నుంచి నోటీసులు అందాయి. 2021 నుంచి 2025 వరకు పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లుకు వడ్డీతో కలిపి రూ.5,700 చెల్లించాలని వాటర్ చార్జెస్ డిమాండ్ నోటీస్ అవడంతో అవాక్కవడం అతడి వంతైంది. సదరు నోటీసు తీసుకొని మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా, అది మిషన్ భగీరథ నీటికి సంబంధించినదని, దరఖాస్తు చేస్తే సరిచేస్తామంటూ సిబ్బంది సెలవిచ్చారు. ఇలా ఒక్కరికే కాదు పట్టణంలోని పలువురికి నోటీసులు అందాయి.
- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ టౌన్)



ఆస్తి పన్నును తలపించేలా చూపుతున్న నల్లా బిల్లు గణాంకాలు అధికారులతో పాటు పట్టణ ప్రజలను నివ్వెరపరుస్తున్నాయి. సాధారణ నల్లా కనెక్షన్లకు నెలకు రూ.100 చొప్పున ఏడాదికి రూ.1200 చెల్లించాలి. పట్టణ పరిధిలో 14,652 నల్లా కనెక్షల్లు ఉండగా, ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు చూపడమేంటన్నది అంతుపట్టని విషయం. సాగర్ నీటి కుళాయిల యజమానులు చెల్లించాల్సిన బిల్లులా? లేక మిషన్ భగీరథ కనెక్షన్లతో కలిపి చూపిస్తున్నారా? అనేది తేలాల్సి ఉంది.

స్పెషల్ డ్రైవ్‌లోనే చెల్లింపులు

ఆస్తి పన్ను ఎప్పుడైనా చెల్లించాల్సిందేననే అవగాహనకు వచ్చిన యజమానులు వాటిని సకాలంలో చెల్లిస్తూనే ఉన్నారు. అయితే ఆస్తి పన్ను సక్రమంగా చెల్లిస్తూనే నీటి పన్నుకు ఎగనామం పెడుతున్నారు కొందరు యజమానులు. మరి కొందరు అసలు నీటి పన్నులు చెల్లించడం లేదు. అయితే అలాంటి వారిని గుర్తించి అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. స్పందించని వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. సంవత్సరంలో రెండు సార్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ పన్ను వసూళ్లను ముమ్మరం చేశారు. యజమానులు సైతం సాధారణ రోజుల్లో పన్నులు చెల్లించకుండా, స్పెషల్ డ్రైవ్‌లోనే స్పందిస్తున్నారు. గత ఏడాది రెవెన్యూశాఖ సహకారంతో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాన్ని ఇచ్చింది.

నీటి పన్ను లెక్కలిలా..

పట్టణ పరిధిలో 14,652 కనెక్షన్లు ఉండగా, ప్రస్తుత సంవత్సర డిమాండ్ రూ.1.79కోట్లు..

- మిగతా 8వ పేజీలో...

1న డిప్యూటీ సీఎం, మంత్రుల రాక

దామరచర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను ఆగస్టు 1న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సందర్శించనున్నారు. థర్మల్ ప్లాంట్‌లోని యూనిట్-1ని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. దీంతో ఈ యూనిట్ ద్వారా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభంకానుంది. అనంతరం కృష్ణానది తీరంలో జెన్‌కో టౌన్‌షిప్ కోసం భూమి పూజ చేయనున్నట్టు తెలిసింది.

4న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు భూమి పూజ

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఆగస్టు 4న భూమి పూజ చేయనున్నట్టు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో సంబంధిత అధికారులతో ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 4న నల్లగొండలో మంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 22 ఎకరాల్లో, 5,36,194చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.200కోట్ల అంచనాతో అధునాతన హంగులతో భవనం నిర్మిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నల్లగొండకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఈఈ బాల ప్రసాద్, కన్సల్‌టెన్సీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నేరడుగొమ్ము, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యతో పాటు, నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం నేరడుగొమ్ము కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. వంటగది, స్టోర్‌రూం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, గణితం, సామాన్యశాస్త్రం ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విటమిన్లు, తదితర అంశాలపై విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలానికి మంజూరైన పీహెచ్‌సీకి సంబంధించిన స్థలాన్ని ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి పరిశీలించారు. కేజీబీవీకి ప్రహరీ లేదని కేజీబీవీ ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తాత్కాలిక ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆర్డీవో రమాణారెడ్డిని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, కేజీబీవీ స్పెషలాఫీసర్ శ్వేత, తదితరులు ఉన్నారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక పెరగడంతో బుధవారం 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 586 అడుగులు (300.3200 టీఎంసీలు)గా ఉంది. 7

హక్కుల సాధనకు పోరాటమే మార్గం

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

హాలియా, జూలై30 (ఆంధ్రజ్యోతి): మాలలు కోల్పోయిన రాజ్యాంగ బద్ధమైన హక్కులను తిరిగి పొందాలంటే పోరాటమే మార్గమని, దానికి మాలలంతా సిద్ధం కావాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మాల మహానాడు నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ వాదులైన మాలలను అణిచివేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల కేటాయింపుతో మాలలకు విద్య, ఉద్యోగ అవకశాలు అందకుండా పోయాయని అన్నారు. ఇంజనీరింగ్, గురుకుల పాఠశాలల్లో సీట్లు రాక, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే స్థోమత లేక చదువులు ఆగిపోయే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు రిజర్వేషన్లను 5 శాతానికి పరిమితం చేసి రోస్టర్ పాయింట్ల కేటాయింపుతో ఆ 5 శాతం రిజర్వేషన్ కూడా మాలలకు దక్కకుండా చేసి రాజ్యాంగ బద్ధ హక్కులను కాలరాశారని అన్నారు. మన హక్కులు తిరిగి పొందాలంటే పోరాటమే మార్గమన్నారు. ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల కేటాయింపుపై మాలలకు జరిగే నష్టాన్ని మండల, గ్రామ స్థాయి సమావేశాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, పరిమి కోటేశ్వర్‌రావు, చెన్నకేశవులు, జంగాల బిక్షం, లక్ష్మమ్మ, లకుమల లిగయ్య, జంగాల శ్రీనివాస్, రువ్వ వెంకటేశ్వర్లు, శాలెం రాజు, జంగాల బిక్షం, జంగాల వీరేందర్, పాలపటి సుమలత, మౌనిక, మద్దూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధర్మస్థల ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బీసం రామయ్య



అమరుల స్థూపం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

మిర్యాలగూడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్రంలోని ధర్మస్థల ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బీసం రామయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1995 నుంచి 2014 వరకు ఆలయంలో పనిచేసిన పారిశుధ్య కార్మికుడు దశాబ్దాల కాలంగా ఒంటిపై గాయాలతో ఉన్న మహిళలు, బాలికల మృతదేహాలను ఖననాలు చేసినట్లు వెల్లడించడం గగుర్పాటు కలిగిస్తోందన్నారు. మహిళల మిస్సింగ్ కేసులపై అక్కడి పోలీసులు కనీస విచారణ చేపట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ధర్మస్థల ఘటనపై సోషల్ మీడియాలో వచ్చిన సుమారు 2వేలకుపైగా వీడియోలను, వార్తలను తొలగించే విధంగా కోర్టును ఆశ్రయించి దుర్మార్గాన్ని ప్రపంచానికి తెలియకుండా దాచాలని చూస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మొత్తం ఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్‌చేశారు. సామాజిక ఉద్యమకారులు జాడి రాజు మాట్లాడుతూ ధర్మస్థల ఘటనలో కేసు నమోదు చేయడానికే పోలీసులు భయపడటం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. జ్యూడీషియల్ విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, డీటీఎఫ్ నాయకులు గణేష్, నారాయణరెడ్డి, కిరణ్మయి, సౌమ్య, మౌజం హుస్సేన్, రాముడు శర్మ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యం

ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



చింతపల్లిలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ ఇలాత్రిపాఠితో కలిసి తొలుత జ్యోతి వెలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు కాకుండా పార్టీ నాయకులకు పథకాలు అందించినట్లు తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల సంక్షేమానికి కట్టుబడి ఉండి పారదర్శకంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాణారెడ్డి, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, మాల్ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, యాదగిరి, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి పాటుపడాలి: ఆర్‌ఎం



డిపోలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం జాన్‌రెడ్డి

మిర్యాలగూడటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తూ ఆర్టీసీ అభివృద్ధికి పాటు పడాలని ఆర్టీసీ ఆర్‌ఎం కొణతం జాన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు నాణ్యమైన సేవలందిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. శ్రావణమాసంతో ఆర్టీసీ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉద్యోగులు అదనపు విధులకు సిద్ధమవ్వాలన్నారు. వరలక్ష్మీ వ్రతం, రాఖీపౌర్ణమి, స్వాతంత్ర్య దినోత్సవం, కృష్ణాష్టమి పండుగలు ఉన్నందున ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశముందని, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రాఖీ పండగ సందర్భంగా మహిళా ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుందని, వారికి మహాలక్ష్మి పథకంలో సేవలందించాలని ఆదేశించారు. సంస్థకు రథసారథులైన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు సమయస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. అనంతరం శ్రావణమాస ఛాలెంజ్ బ్యానర్‌ను ఆవిష్కరించారు.

సాగర్ ఎడమకాల్వలో యువకుడి గల్లంతు

మిర్యాలగూడఅర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమ కాల్వ సమీపంలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఇద్దరు యువకుల్లో ఒకరు గల్లంతుకాగా మరొకరిని స్థానికులు కాపాడారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు, స్థానికులు, తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చౌగాని శంకర్ (38) పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవాడు. సూర్యాపేటలో మరో ప్రైవేటు ఉద్యోగం చూసుకుని అక్కడకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నాడు. స్నేహితుడు రాకేష్‌తో కలిసి ఈత కొట్టేందుకు మధ్యాహ్న సమయంలో సాగర్ ఎడమకాల్వ వద్దకు వెళ్లారు. మల్లేపల్లి రాకేష్ కాల్వలోకి వెళ్లి ఈదుతుండగా చౌగాని శంకర్‌కు ఈత రాకపోవడంతో అక్కడే ఉన్న మెట్లను పట్టుకున్నాడు. శంకర్ పట్టుతప్పి కాల్వలోకి జారి నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. శంకర్‌ను కాపాడేందుకు రాకేష్ ప్రయత్నించగా అతడు సైతం నీటి ప్రవాహంలో కొట్టుకుపోతూ కేకలు పెట్టాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కొందరు, సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న రైతులు, మహిళా కూలీలు గమనించి వారి వద్ద ఉన్న వస్త్రాల సహాయంతో రాకేష్‌ను కాపాడారు. అప్పటికే శంకర్ గల్లంతయ్యాడు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం

చింతపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో నూతనంగా నిర్మించబోయే ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందిస్తున్నారు. తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పొగాకు శ్రీశైలం, సంతోష దంపతులు 21,116, మామిడి తిరుపతమ్మ అంజయ్యగౌడ్ రూ.80,000, శిరసవాడ జగన్ శివలీల రూ.25,116, అంకం మల్లమ్మ వెంకటయ్య దంపతులు రూ.5,116 విరాళాలు ఉత్సవ కమిటీకి అందించారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, రామస్వామి పాల్గొన్నారు.

నేడు కొండమల్లేపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

కొండమల్లేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండలంలో నేడు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పర్యటించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన, నూతనంగా రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



వృద్ధదంపతుల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టులో వరినాట్ల కార్యక్రమం ఊపందుకున్నందున రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువులను అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధ దంపతుల వద్దకు నేరుగా అధికారులతో కలిసి వెళ్లి సమస్యను విని ఫిర్యాదును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను 15రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. ప్రజావాణి కార్యక్రమంతో అధికారుల్లో జవాబుదారితనం పెరిగి సామాన్యులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఎంఈవో బాలాజి నాయక్, ఎంపీడీవో శర్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

పెద్దవూర, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలగూడెం ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పాఠశాలను తనిఖీ చేసి, మూత్రశాలలు, ప్రహరీ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు పడుతున్నందున అమ్మ ఆదర్శ పాఠశాల, పాఠశాల ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.1.70లక్షలతో మూత్రశాలలు, ప్రహరీ త్వరగా నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, లింగయ్య, ఈదయ్య, ఎంఈవో రాములు, ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు రేణుక, కాంట్రాక్టర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

త్రిపురారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల కుల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి ఆలయ భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని నీలాయిగూడెం గ్రామంలో బుధవారం కులస్థులతో కలిసి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి ప్రతీఒక్కరు తమ సహాయ సహకారాలు అందించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అడహక్ కమిటీ అధ్యక్షుడు పామోజు వెంకటచారి, అర్రూరి సైదులు, చెట్లపెల్లి శంకరయ్య, వెంకటేశ్వర్లు, రేపాల శ్రీను, రాసికపు హనుమయ్య, చాగంటి సత్యం, సైదులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రదీప్ మృతి బాధాకరం

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం ముదిగొండ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నల్ల ప్రదీప్ మృతిచెందడం బాధాకరమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తు గుండెపోటుతో మృతి చెందిన కానిస్టేబుల్ ప్రదీప్ మృతదేహాన్ని స్వగ్రామమైన ముదిగొండకు తీసుకువచ్చారు. ప్రదీప్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ప్రదీప్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రదీప్ మృతికి సంతాపం తెలిపినవారిలో బీఆర్ఎస్ నాయకులు టీవీఎన్‌రెడ్డి, చింతపల్లి సుభాష్‌గౌడ్, కసిరెడ్డి రవీందర్‌రెడ్డి, జైహింద్‌రెడ్డి, రేపాని ఇద్దయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

చింతపల్లి: సిరసనగండ్ల గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు నందమాచారి బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. అతని ఆకస్మిక మృతికి చింతపల్లి సాయిసన్నిధి చైర్మన్ మంచికంటి ధనుంజయ్యతోపాటు పలువురు సంతాపం తెలిపారు. భక్తిగీతాల ఆలాపనలో ఆయనకు మించి సాటిలేరని అభిప్రాయపడ్డారు. అయ్యప్ప భక్తులు సైతం మృతికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సొంత భవనాలు కేటాయించాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

మిర్యాలగూడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ వసతి గృహాలు, కార్యాలయాలకు సొంత భవనాలు కేటాయించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు మండల బొట్టు సోములు, సీనియర్ నేత వనం మదన్‌మోహన్ మాట్లాడుతూ అరకొర వసతులున్న అద్దె భవనాల్లో వసతిగృహాలు నిర్వహించడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని, రోగాల బారిన పడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర రెసిడెన్షియల్ పాఠశాలలు అన్నీ అద్దె భవనాల్లోనే ఉన్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల అంతస్తుల్లో ఉన్న కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రధానంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకైన భవనంలో, మొదటి అంతస్తులో ఉన్న కారణంగా లావాదేవీల కోసం వచ్చే వినియోగదారులు నానా తిప్పలు పడుతున్నారని, సీనియర్ సిటిజన్లు పైఅంతస్తుకు ఎక్కలేకపోతున్నారన్నారు. పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు, పాత వ్యవసాయ మార్కెట్ స్థలాలు ఖాళీగా, నిరుపయోగంగా ఉన్నాయని, వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఆయా స్థలాలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బంటు గిరి, నేరెళ్ల అజయ్, దైద రవి, కిరణ్, యాదగిరి, రవి, నాగరాజు, శ్రీను, నంద తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు అపరిశుభ్రం దోమలకు నిలయం

● ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం ● నిర్వహణ అస్తవ్యస్తం ● సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ● సమస్య పరిష్కరించాలని వినతి

ఎక్కడపడితే అక్కడ చెత్తా చెదారం. నెలల తరబడి మురుగుకాల్వలు తీయకపోవడంతో దుర్గంధభరితం. వెరసి చింతపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఖాళీ స్థలాలు, పెంటకుప్పలు దోమలకు ఆవాసంగా మారి, వ్యాధులకు కారణంగా మారుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)



వీటీనగర్‌లో ఖాళీస్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధుల బారినపడడం ఖాయం. మండలంలోని పలు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, ఖాళీ స్థలాలు దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. వాటిలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి ఉదయం, సాయంత్రం అయిందంటే దోమలు, వీధులు, ఇళ్లలో వచ్చి చేరుతున్నాయి.

జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చింతపల్లి మండలంలో 34 గ్రామపంచాయతీలున్నాయి. పలు గ్రామాల్లో అధికశాతం ఖాళీ స్థలాలు ఉండటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమలు పెరగడానికి ప్రధాన కారణమవుతున్న చెత్తతో నిండి ఖాళీస్థలాలను అధికారులు పట్టించుకోవడంలేదని, వెంటనే అధికారులు స్పందించి చెత్తరహితంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని గొడకొండ్ల, వేంకటేశ్వరనగర్, ఎం.మల్లేపల్లి తదితర గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడే దోమలు నివాసముండి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ఫాగింగ్ జాడేదీ?

వానాకాలం ఆరంభం నుంచే దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉంది. కానీ అలాంటిదేమీ జాడ కన్పించడంలేదు. వర్షాకాలం కావడంతో ఖాళీ స్థలాలతో పాటు, మురుగు కాల్వలో మురుగు నీరు నెలల తరబడి నిల్వ ఉంటుంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

పారిశుధ్య పనులు చేయిస్తాం



శిథిలావస్థలో చేరిన ఇళ్ల స్థలాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా పారిశుధ్యం పనులు చేయిస్తాం.

సుజాత, ఎంపీడీవో(చింతపల్లి)

సానుకూలంగా స్పందించడం అభినందనీయం

డిండి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీలో పనిచేస్తున్న తమ సమస్యల పరిష్కారానికి మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించడం అభినందనీయమని ఫీల్డ్ అసిస్టెంట్లు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్లుగా పరిష్కారంకాని తమ సమస్యలు కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిష్కారం కావడం ఆనందంగా ఉందన్నారు. ఫీల్డు అసిస్టెంట్‌ల మధ్య వ్యత్యాసంలేకుండా ఒకే వేతనం చెల్లించాలని మంత్రి ఆదేశించారని తెలిపారు. వీటితోపాటు ఫీల్డు అసిస్టెంట్‌ల గ్రూపు ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించేందుకు మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. సర్క్యులర్ 4779 రద్దు, గతంలో తొలగించిన ఫీల్డు అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకునేలా సాధ్య, అసాధ్యాలను మంత్రి పరిశీలిస్తారని తెలిపారు. సమావేశంలో నాయకులు సీత రాంరెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

కేటీఆర్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కులేదు

● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ● దేవరకొండలో రేషన్‌కార్డుల పంపిణీ ● డిండిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



దేవరకొండలో నూతన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): కేటీఆర్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కులేదని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ మార్కెట్‌యార్డులో నూతన రేషన్‌కార్డులను పంపిణీచేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో 5.60లక్షల కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక కేటీఆర్ మతి భ్రమించినట్లు మాట్లాడుతున్నాడని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను నామ రూపంలేకుండా చేయాలన్నారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్‌కార్డులు నిరంతరం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో డానియెల్, సిరాజ్‌ఖాన్, రాంసింగ్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

డిండి : విద్యారంగంలో సమూల మార్పులకోసం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. రేషన్ కార్డుల పంపిణీలో ఆయన మాట్లాడారు. డిండి మండలంలో 1815 మంది లబ్ధిదారులకు నూతనంగా రేషన్‌కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. డిండి మండలకేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో రూ.9లక్షలతో డ్రైనేజీ, ప్రహరీ నిర్మాణం, హైమాస్ట్ లైట్లకు శంకుస్థాపన చేశారు. రూ.10లక్షలతో ఆదర్శ పాఠశాలలో ప్రహరీ నిర్మాణం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.5లక్షలతో ప్రహరీనిర్మాణంతోపాటు టాయిలెట్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, నీటిపారుదలశాఖ ఎస్ఈ బద్రునాయక్, ఈఈ యలమందయ్య, ప్రత్యేక అధికారి చత్రునాయక్, తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో వెంకన్న, పీఆర్ ఏఈ విజయ్‌కుమార్, డీఈలు శ్రీనివాస్, మనోహర్, జేఈలు పరమేష్, సాయికుమార్, హరినాథ్‌రెడ్డి, కర్నాకర్ పాల్గొన్నారు.

బీసీల గురించి మాట్లాడే అర్హత కవితకు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న నీరుకంటి నారాయణ

మిర్యాలగూడ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే అర్హత ఎమ్మెల్సీ కవితకు లేదని కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ బీసీల ఊసెత్తని కవిత బీసీ బిల్లు సాధనకు దీక్ష చేపడతాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన బీసీలను నాడు విస్మరించి, నేడు కపట ప్రేమ చూపిస్తే ఎవరూ నమ్మరన్నారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, కానిస్టేబుల్ శ్రీను, ఎంఏ రెహమాన్, ఏఎస్ రత్నం తదితరులకు జరిగింది, ఒరిగింది ఏమీ లేదన్నారు. పదేళ్ల పాలనలో బడుగు, బలహీనవర్గాల సంక్షేమం గురించి స్పందించని కవిత 72 గంటల నిరాహార దీక్ష చేపడతానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. చట్ట సభల్లో బీసీల ప్రాధాన్యతను పెంచే విధంగా 42శాతం రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీసీ బిడ్డలందరూ ఆశీర్వదించాలని, హస్తం పార్టీని అక్కున చేర్చుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు కుప్పాల సుబ్బారావు, పసుపులేటి శివ, ఎం వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, బాబు, శ్రీనివాస్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన అవసరం

మిర్యాలగూడ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగాధిపతి శివకృష్ణ అన్నారు. వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల విద్యార్థులకు ఆర్థిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఆర్థిక పురోగతి, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ తదితర అంశాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్ బంగారుమయమవుతుందన్నారు. శిబిరానికి హాజరైన ఆర్థికరంగ నిపుణులు హేమంత్‌నాగ్, డాక్టర్ నరేష్ గుమ్మడి పలు అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో త్రాసు వెంకటరమణ, నాగరాజు పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్ పంపిణీ

హాలియా, జూలై30(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సోనూసూద్ పుట్టిన రోజు సందర్భంగా అమీర్‌అలీ ఫౌండేషన్ అధ్వర్యంలో హాలియాలో వృద్ధులు, రోగులకు పండ్లు, బ్రెడ్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమీర్‌అలీ ఫౌండేషన్ చైర్మన్ అమీర్‌అలీ మాట్లాడుతూ సాటి మనిషికి సహాయం చేసే ప్రతిఒక్కరూ రియల్ హీరోలే అని, కరోనా సమయంలో బతుకుదెరువు కోసం సొంత గ్రామాల నుంచి వలస వచ్చిన కార్మికులకు అండగా నిలబడి తన సొంత ఖర్చులతో వలస కూలీలను సొంత గూటికి చేర్చిన సోనూసూద్ సేవా స్ఫూర్తి దేశమంతా గర్వించిందన్నారు. ఆయన సేవా కార్యక్రమాలు నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో జాని, బాబ, కృష్ణ, రావులపాటి శ్రీనుగౌడ్, బాబు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడికి పరామర్శ

హాలియా, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, జిల్లా కౌన్సిలర్ల సంఘం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి ప్రమాదవశాత్తు కాలు జారిపడి కాలికి గాయం కాగా బుధవారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దొరేపల్లి వెంకటేశ్వర్లు, బందిలి పెద్దసైదులు, పగడోజు సైదాచారి, మద్దిమడుగు మార్క్, రావులపాటి ఎల్లయ్య, మారుపాక మల్లిఖార్జున్‌గౌడ్, నాగరాజుగౌడ్, అయితగోని సతీష్‌గౌడ్, సుబ్రమణ్యం, నాగరాజు తదితరులు ఉన్నారు.

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

● ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి

మిర్యాలగూడ అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆగస్టు మొదటి వారంలో చేపట్టే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి సూచించారు. మంగళవారం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళా, శిశుసంక్షేమశాఖ ఆదేశాల మేరకు తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు మొదటి వారంలో జిల్లా వ్యాప్తంగా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి తల్లిపాల ప్రాధాన్యం గురించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. తల్లిపాలతో శిశువు ఆరోగ్యంగా ఎదగడంతోపాటు తల్లి ఆరోగ్యం సైతం సురక్షితంగా ఉంటుందన్నారు. మహిళల్లో చైతన్యం లేకపోవడం, శారీరక సౌందర్యం సన్నగిల్లుతుందన్న అపోహతో కొందరు పిల్లలకు పాలుపట్టకుండా డబ్బాపాలు అందించడంతో శిశువు అనారోగ్యానికి లోనై వయసు తగిన స్థాయిలో బరువు పెరగడం లేదన్నారు. తల్లిపాల వారోత్సవాలకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల సహకారం తీసుకొని విజయవంతం చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఐడీడీఎస్ సూపర్‌వైజర్ మమత, అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సీసీరోడ్డు



ప్రమాదకరంగా మారిన సీసీ రోడ్డు

కొండమల్లేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులోని దాదాపు రెండు నెలల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో కాలనీవాసులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సీసీ రోడ్డు ఎత్తులో ఉండటంతో వాహనాలు దాటే క్రమంలో ప్రమాదానికి గురవుతున్నారు. ఎన్నిసార్లు కాంట్రాక్టర్‌కు చెప్పినా, పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

మిర్యాలగూడ అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆపరేషన్ ముస్కట్ టీం ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 18ఏళ్లలోపు బాల, బాలికలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. తల్లిదండ్రులు ప్రయాణ సమయంలో తమ పిల్లల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులపట్ల అనుమానం కలిగిన వెంటనే 100కు ఫోన్‌చేసి సమాచారమివ్వాలన్నారు. పోలీస్ సేవలను వినియోగించుకునేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లపై తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రుత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాము, లక్ష్మణ్ తదితరలు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోలీసులు

యువ చైతన్య యాత్రను జయప్రదం చేయాలి



యువచైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వన్‌టౌన్ సీఐ మోతీరాం, డీవైఎఫ్ఐ నాయకులు

● డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్

మిర్యాలగూడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువ చైతన్య సైకిల్‌యాత్రను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మూడావత్ రవినాయక్ అన్నారు. బుధవారం స్థానిక వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మోతీరాం, సోమనర్సయ్యలతో కలిసి సైకిల్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత అనేక చెడు అలవాట్లకు లోనవుతూ తమ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటుందన్నారు. యువశక్తిని వినియోగించుకోలేని సమాజం అభివృద్ధిని సాధించలేదన్నారు. సెల్‌ఫోన్‌లు, మద్యం, డ్రగ్స్, బెట్టింగ్ తదితర వాటికి బానిస అయిన యువకులు లక్ష్యం లేకుండా మానసిక క్షోభకు గురవుతూ సమాజానికి చెడుచేయడానికి వెనకాడటం లేదన్నారు. ఈ నెల 24న నకిరేకల్ నుంచి చేపట్టిన యువ చైతన్య సైకిల్ యాత్రను 31న మిర్యాలగూడ మండలానికి చేరుకుంటుందన్నారు. రెండురోజులపాటు మండలంలో పర్యటించి ఆగస్టు 2న మిర్యాలగూడలో యాత్ర ముగుస్తుందన్నారు. చైతన్య యాత్రను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ఆశీర్వాదం, వదూద్, నాగేంద్రప్రసాద్, బాబు నాయక్, పల్లా భిక్షం, నాగరాజు, మోహన్ పాల్గొన్నారు.

పన్ను బకాయిలు రూ.10కోట్లకు పైనే

(5వ పేజీ తరువాయి)

ఎరియర్స్ రూ.9.65కోట్లతో కలిపి రూ.11.44 కోట్లు వసూలు కావాలి. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు నీటి పన్ను వసూళ్ల శాతం కేవలం 4.5శాతమే అయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పురపాలికకు ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న అధికారులు వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండటంతో రోజుకు రూ.70 నుంచి 80వేల నీటి పన్ను బకాయిలు వసూలు అవుతున్నాయి.

దరఖాస్తుచేస్తే పరిశీలిస్తాం

పట్టణంలోని కొందరు యజమానులకు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ బిల్లులు వస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. మిషన్ భగీరథ నీటిని వినియోగించుకునే వారు నీటి పన్ను చెల్లించాల్సిందే. కనెక్షన్ లేకున్నా నోటీసులు వస్తే కార్యాలయంలో దరఖాస్తు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఏదైమైనా నీటి పన్ను బకాయిలు కోట్ల రూపాయలు పేరుకుపోయిన మాట వాస్తవమే. కొందరు యజమానులు ఆస్తి పన్ను చెల్లించి, నీటి పన్ను జోలికి వెళ్లడం లేదు. అలా సరి కాదు. ఆస్తి, నీటి, వాణిజ్య పన్నులు సకాలంలో చెల్లిస్తే ఏ ఇబ్బంది ఉండదు.

\- గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : జూనియర్/ వెంకటేశ్వర: హరిహర వీరమల్లు / రాఘవ: హరిహర వీరమల్లు / విగ్రోస్: హరిహర వీరమల్లు (3 స్క్రీన్లలో) దేవరకొండ : మనోజ్ : మైబేబీ మైత్రి వెంకటేశ్వర : హరిహర వీరమల్లు